


ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3

తిరుపతి
జిల్లా వార్తలు
సోమవారం 19 ఆగస్టు 2024



ఫొటో అన్నది ప్రతిబింబం కాదు. దృశ్య రూపంలో చెప్పే కవిత్వం. కాలానికి సాక్ష్యంగా మిగిలే చరిత్ర. ఒక తాత్విక కళ. మాయాదీపం. అందాన్నీ, అందంలోని బీభత్సాన్నీ, ఆనందంలోని విషాదాన్నీ కూడా ఏకకాలంలో పటంగట్టి చూపిస్తారు ఫొటోగ్రాఫర్లు. అందుకు నిదర్శనమే ఈ ఫొటోలు. తిరుపతి నగరంలో, తిరుమల కొండ మీద, చిత్తూరు పల్లెల్లో ఆదివారం ఉదయం నుంచీ సాయంత్రం దాకా ఆంధ్రజ్యోతి కెమెరా కంటబడ్డ బతుకు చిత్రాలు ఇవి. మనసుపెట్టి చూస్తే ఎన్నో కథలు చెబుతాయి. మనల్ని కదిలిస్తాయి. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా తిరుపతి, చిత్తూరు, తిరుమలలోని ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్లు వీటిని అందిస్తున్నారు.

నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ డే

జీవన చిత్రం




















రూ.1,570 కోట్ల పెట్టుబడులతో 15 పరిశ్రమలకు ప్రారంభోత్సవం

రూ.900 కోట్లతో ఏడు పరిశ్రమలకు భూమిపూజ

రూ.1,213 కోట్లతో ఐదు పరిశ్రమల స్థాపనకు ఒప్పందాలు

నేడు శ్రీసిటీకి సీఎం చంద్రబాబు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం జిల్లాలోని శ్రీసిటీ ప్రత్యేక ఆర్థిక మండలిని సందర్శించనున్నారు. ఈ సందర్భంగా రూ.1,570 కోట్ల పెట్టుబడులతో, 8,480 మందికి ఉద్యోగాలు కల్పించే స్థాయిలో ఏర్పాటైన 15 పరిశ్రమలను ప్రారంభించనున్నారు. రూ.900 కోట్ల పెట్టుబడులు, 2,740 మందికి ఉద్యోగాలు కల్పించే ఏడు పరిశ్రమలకు భూమిపూజ చేయనున్నారు. అలాగే రూ.1,213 కోట్ల పెట్టుబడితో 4,060 మందికి ఉద్యోగావకాశాలు కల్పించే మరో ఐదు పరిశ్రమల స్థాపనకు సంబంధిత ప్రతినిధులతో ఒప్పందాలు కుదుర్చుకోనున్నారు.

- సత్యవేడు

పర్యటన వివరాలిలా..

సీఎం కార్యాలయం నుంచి అందిన అధికారిక షెడ్యూలు ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం ఉదయం పది గంటలకు ఉండవల్లిలోని తన నివాసం నుంచి బయల్దేరి గన్నవరం విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడ 10.40 గంటలకు విమానంలో బయల్దేరి 11.30 గంటలకు తిరుపతి విమానాశ్రయానికి రానున్నారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి మధ్యాహ్నం 12 గంటలకు శ్రీసిటీ వెళతారు. శ్రీసిటీలో బిజినెస్ సెంటర్ సందర్శించి మధ్యాహ్నం 2.30 వరకూ రెండు గంటల పాటు అక్కడే గడపనున్నారు. నిర్మాణం పూర్తి చేసుకున్న పరిశ్రమలను ప్రారంభించడంతోపాటు కొత్తగా ఏర్పాటు కానున్న పరిశ్రమలకు భూమిపూజ చేస్తారు. అలాగే ప్రతిపాదిత పరిశ్రమల స్థాపనకు ఆయా సంస్థల ప్రతినిధులతో ఒప్పందాలు కుదుర్చుకోనున్నారు. ఈ కార్యక్రమాలు ముగించుకుని మధ్యాహ్నం 2.40 గంటలకు శ్రీసిటీ నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి తిరుపతి విమానాశ్రయం చేరుకుని మూడు గంటలకు విమానంలో బయల్దేరి గన్నవరం తిరుగు ప్రయాణం కానున్నారు.

ప్రారంభించనున్న పరిశ్రమలు ఇవే!

శ్రీసిటీలో ఎల్జీ పాలిమర్స్, నైడెక్, ఈప్యాక్ డ్యూరబుల్స్, నియో లింక్ టెలికమ్యూనికేషన్స్, ఓజీ ఇండియా ప్యాకేజింగ్, జెన్ లైనెన్ ఇంటర్నేషనల్, బెల్ ఫ్లేవర్స్ అండ్ ఫ్రాగ్రెన్సెస్, జేజీఐ మెటల్ కన్వెర్ట్స్, త్రినాథ్ ఇండస్ట్రీస్, ఎవర్ షైన్ మౌల్డర్స్, ఆటోడేటా, ఎస్‌కే కాంపొనెంట్స్, అడ్మైర్ కేబుల్స్, బాంబో కోటెడ్ అండ్ స్పెషల్ స్టీల్, శ్రీలక్ష్మీ ఆగ్రో ఫుడ్స్ తదితర 15 పరిశ్రమలతోపాటు శ్రీసిటీ ఈఎంసీ ఫైర్ స్టేషన్‌ను కూడా సీఎం చంద్రబాబు ప్రారంభించనున్నారు. ఈ పరిశ్రమలు ఇండియాతోపాటు జపాన్, దక్షిణ కొరియా, జర్మనీ, ఇజ్రాయెల్ తదితర దేశాలకు సంబంధించినవి.

భూమిపూజ చేయనున్నవి

బ్లూస్టార్, ఎన్‌సీసీ ట్రాన్స్‌మిషన్, సిద్ధార్థ లాజిస్టిక్స్, టీఏఎల్ హెల్త్ కేర్, ఏజీపీ సిటీ గ్యాస్, ఆర్ఎస్‌బీ ట్రాన్స్‌మిషన్, వెర్మైరెన్ రిహాట్ తదితర ఏడు పరిశ్రమలతోపాటు హైటెక్ పోలీస్ స్టేషన్ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారు. ఈ పరిశ్రమలు మనదేశంతోపాటు జపాన్, బెల్జియం, చైనా తదితర దేశాలకు చెందినవి.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు

అధికారుల పరిశీలన

శ్రీసిటీలో ఏపీఐఐసీ ఎండీ అభిషిక్త కిషోర్, కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం భన్సల్, ఎస్పీ సుబ్బరాయుడు పర్యటించారు. ఏర్పాట్లను పరిశీలించారు.

శ్రీసిటీకి ఆరోసారి వస్తున్న బాబు

చంద్రబాబు ముఖ్యమంత్రి హోదాలో శ్రీసిటీ పర్యటనకు సోమవారం ఆరోసారి విచ్చేయనుండడం విశేషం. శ్రీసిటీ సెజ్ ఏర్పాటయ్యాక 2015 ఏప్రిల్ 3న తొలిసారి పెప్సీ పరిశ్రమ ప్రారంభానికి విచ్చేశారు. అదే రోజు శ్రీసిటీలో 11 పరిశ్రమలకు భూమిపూజ చేశారు. 2016 ఏప్రిల్ 25, 27 తేదీల్లో రెండుసార్లు వచ్చారు. మాండలెజ్, ఇసుజు పరిశ్రమల ప్రారంభోత్సవాలు చేశారు. 2018 జనవరి 9న అపోలో టైర్స్ పరిశ్రమ భూమిపూజకు, 2018 మార్చి 23న హీరో మోటార్స్ పరిశ్రమ భూమిపూజకు శ్రీసిటీకి విచ్చేశారు. ఇక వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్కసారైనా శ్రీసిటీకి రాని సీఎంగా జగన్ నిలవడం గమనార్హం.

ఐదు సంస్థలతో ఒప్పందాలు

డైకిన్, యాక్సెలెంట్ ఫార్మా, ఆర్మ్ వెస్ట్ మిర్రైటెక్ ఇండియా, క్యాప్ మ్యాన్ ఇండియా, పీఐ ప్రిస్టేజ్ ఇంటర్నేషన్ తదితర ఐదు పరిశ్రమల ఏర్పాటుకు ఆయా సంస్థల ప్రతినిధులతో ఎంఓయూలు కుదుర్చుకుంటారు. ఇవన్నీ మన దేశంతోపాటు జపాన్, సింగపూర్, ఇండోనేషియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ తదిర దేశాలకు సంబంధించినవి. అనంతరం శ్రీసిటీలోని వివిధ పరిశ్రమల సీఈవోలతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు.

పటిష్ఠ బందోబస్తు

తిరుపతి (నేరవిభాగం), ఆగస్టు 18: శ్రీసిటీ పర్యటనకు సీఎంతోపాటు హోంమంత్రి వంగలపూడి అనిత, డీజీపీ ద్వారకా తిరుమలరావు వస్తుండడంతో జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేసింది. డీజీపీ ఆధ్వర్యంలో ఎస్పీ సుబ్బరాయుడు స్వీయ పర్యవేక్షణలో ముగ్గురు అదనపు ఎస్పీలు, 10 మంది డీఎస్పీలు, 20 మంది సీఐలు, 25 మంది ఎస్ఐలు, 100 మంది ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, 150 మంది కానిస్టేబుళ్లు, 60 మంది రిజర్వు బలగాలు, రోప్‌పార్టీలు, డాగ్, బాంబు స్క్వాడ్‌లు బందోబస్తులో ఉన్నాయి. వీరితోపాటు కాన్వాయ్ పార్టీలో ఆరు బృందాలున్నాయి.

చంద్రబాబు 70 రోజుల పాలనలోనే..

శ్రీసిటీకి రూ.2వేల కోట్ల పెట్టుబడులు

- 6,800 మందికి ఉద్యోగావకాశాలు
- గతంలో సీఎంగా వుండగా వంద పరిశ్రమల ఏర్పాటు
- ఇపుడూ అదే చొరవ.. పట్టుదల

తిరుపతి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు ముఖ్యమంత్రిగా పాలనా పగ్గాలు చేపట్టి నేటికి కేవలం 70 రోజులవుతోంది. ఈ స్వల్ప వ్యవధిలోనే జిల్లాలోని శ్రీసిటీకి రూ.2వేల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి. 6,800 మంది యువతకు ఉద్యోగాలు కల్పించే అవకాశాలు ఏర్పడుతున్నాయి. గతంలో 2014-19 నడుమ సీఎంగా వున్న సమయంలో ఆయన చొరవ కారణంగా ఏకంగా వంద పరిశ్రమలు శ్రీసిటీలో ఏర్పాటైన సంగతి తెలిసిందే. తాజాగా పాలనపై పట్టు రావాలని కాలయాపన చేయకుండా అధికారంలోకి వచ్చీరాగానే సొంత జిల్లా పట్ల, ప్రత్యేకించి పారిశ్రామిక అభివృద్ధి పట్ల అదే చొరవ, పట్టుదల వ్యక్తమవుతుండడం జిల్లావాసుల్లో హర్షాతిరేకాలు నింపుతోంది. చంద్రబాబు చొరవ, పట్టుదల చూస్తుంటే రానున్న రోజుల్లో శ్రీసిటీకి తద్వారా జిల్లాకు పారిశ్రామికంగా భారీ పెట్టుబడులు, ప్రయోజనాలు సమకూరే అవకాశాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి.

సగం పరిశ్రమలు బాబు హయాంలోనే ఏర్పాటు

సత్యవేడు, వరదయ్యపాలెం మండలాల పరిధిలో నెలకొల్పిన శ్రీసిటీ ప్రత్యేక ఆర్థిక మండలిలో ప్రస్తుతం 220 పరిశ్రమలు నడుస్తున్నాయి. ఈ పరిశ్రమల ద్వారా రూ.45వేల కోట్ల పెట్టుబడులు జిల్లాకు వచ్చాయి. వీటిలో 62వేల మంది ఉద్యోగులు పని చేస్తుండగా 70 శాతం మంది రాష్ట్రానికి చెందిన వారుండగా మొత్తం మీద 40 శాతం మంది జిల్లావాసులున్నారు. శ్రీసిటీ గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏర్పాటైనప్పటికీ అందులో పరిశ్రమల స్థాపనకు 2014-19 నడుమ చంద్రబాబు ప్రభుత్వం విశేషంగా కృషి చేసింది. సొంత జిల్లా కావడంతో ఆయన శ్రీసిటీపై ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో ఆ ఐదేళ్లలో ఏకంగా వంద పరిశ్రమలు శ్రీసిటీకి తరలివచ్చాయి. వాటిలో పెప్సీకో, మాండలెజ్, ఇసుజు, ఫాక్స్ కాన్, హీరో మోటార్స్, అపోలో టైర్స్ వంటి ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ పరిశ్రమలు వున్నాయి. ఈ పరిశ్రమల కారణంగా పారిశ్రామిక పటంలో జిల్లా కీర్తిప్రతిష్ఠలు అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడించాయి.



ప్రారంభానికి సిద్ధమైన ఈప్యాక్ డ్యూరబుల్ కంపెనీ

అక్రమార్కులపై ఎస్పీ కొరడా

గ్రావెల్ అక్రమ రవాణాకు సహకరించిన హెడ్‌కానిస్టేబుల్, హోంగార్డు సస్పెన్షన్

చంద్రగిరి సీఐకి చార్జి మెమో

అనధికారిక జరిమానా వసూలు చేస్తున్న మరో హోంగార్డుపైనా వేటు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 18: అక్రమార్కులపై ఎస్పీ సుబ్బరాయుడు కొరడా ఝుళిపించారు. ఓ హెడ్ కానిస్టేబుల్‌తోపాటు ఇద్దరు హోంగార్డులను ఆదివారం సస్పెండ్ చేశారు. ఓ సీఐకి చార్జి మెమో ఇచ్చారు. వివరాలిలా ఉన్నాయి. చంద్రగిరి మండలంలోని గంగుడుపల్లె, మండపంపల్లె గ్రామాల సమీపం నుంచి మల్లయ్యపల్లె మీదుగా గ్రావెల్ తవ్వి టిప్పర్ల ద్వారా అక్రమంగా రవాణా చేస్తున్నారు. ప్రభుత్వ ఖజానాకు గండికొడుతూ అధికారుల కళ్లు కప్పి కొద్ది రోజులుగా జరుగుతున్న ఈ అవినీతి తంతుపై చంద్రగిరి సీఐ రామయ్యకు ఫిర్యాదులు అందాయి. ఈ విషయం బయటకు పొక్కకుండా హెడ్‌కానిస్టేబుల్ ఎస్.బసవయ్య, హోంగార్డు సుధాకర్‌లను వెంటనే గ్రావెల్ అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను అడ్డుకోవాలని ఆదేశించారు. సీఐ ఆదేశాలను వారు పట్టించుకోలేదు. మరోవైపు ఈ అంశంపై స్థానికులు కొందరు నేరుగా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. విచారణ చేసిన ఆయన గ్రావెల్ అక్రమంగా రవాణా చేస్తున్నవారికి తమ సిబ్బంది వంత పాడినట్లు నిరూపణ అయింది. దాంతో చంద్రగిరి సీఐ రామయ్యకు చార్జి మెమో జారీ చేశారు. రక్షక్ మొబైల్ హెడ్‌కానిస్టేబుల్ బసవయ్య, హోంగార్డు సుధాకర్‌ను సస్పెండ్ చేశారు. శాఖా పరమైన విచారణకూ ఆదేశించారు. అలాగే తిరుపతి ట్రాఫిక్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు శ్రీనివాసులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై అనధికారికంగా జరిమానా విధిస్తున్నాడని ఎస్పీకి ఫిర్యాదు అందింది. విచారణలో అక్రమ వసూళ్లు చేస్తున్నది నిజమని తేలడంతో అతడినీ సస్పెండ్ చేశారు. పోలీసు శాఖలోని ప్రతి ఒక్కరూ ప్రజల మన్ననలు పొందేలా పనిచేయాలని ఈ సందర్భంగా ఎస్పీ పేర్కొన్నారు. అవినీతి, అక్రమాలకు పాల్పడితే ఏ స్థాయి అధికారైనా ఊరుకునేది లేదని హెచ్చరించారు.

శ్రీవారు వేసే శిక్ష నుంచి తప్పించుకోలేరు

టీటీడీ ఏడీ బిల్డింగ్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తప్పు చేసిన వాళ్లు సాంకేతిక కారణాలతో చట్టం నుంచి తప్పించుకున్నా.. శ్రీవేంకటేశ్వర స్వామి వేసే శిక్ష నుంచి మాత్రం తప్పించుకోలేరని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. టీటీడీ పరిపాలన భవనంలోని ఇంజనీరింగ్ విభాగంలో జరిగిన అగ్నిప్రమాదం ఘటనను పరిశీలించడానికి ఆదివారం కూటమి నేతలతో కలసి ఎమ్మెల్యే ఏడీ బిల్డింగ్‌కు వెళ్లారు. వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గది లోపలకు వెళితే, ఆధారాలు చెరిగిపోతాయని పోలీసులు, విజిలెన్స్ అధికారులు తెలిపారు. ఘటన మొత్తాన్ని వీడియో ద్వారా వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ శ్రీవారి పాలనా నిర్వహణకు గుండెకాయ వంటి టీటీడీ పరిపాలనా భవనంలో అగ్నిప్రమాదం జరగడం దురదృష్టకరమన్నారు. ఇంజనీరింగ్ విభాగంలోని బైపాస్ రోడ్లను పర్యవేక్షించే డీఈకి సంబంధించిన ఫైళ్లు మాత్రమే దగ్ధం కావడం పలు సందేహాలకు తావిస్తోందని చెప్పారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇంజనీరింగ్ పనుల్లో జరిగిన అవకతవకలకు సంబంధించి పలువురికి విజిలెన్స్ నోటీసులు జారీ అయిన నేపథ్యంలో ఈ ఘటన జరగడం దురదృష్టకరమని అన్నారు. పోలీసుల దర్యాప్తు కొనసాగుతోందని.. నిజానిజాలు బయట పడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు నరసింహ యాదవ్, కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయుడు, నాయకులు ఊట్ల సురేంద్ర నాయుడు, ఆర్సీ శ్రీనివాసులు, జగ్గా, లక్ష్మీ, రవి తేజా నాయుడు, జనసేన నాయకులు రాజా రెడ్డి, ఆర్కాట్ కృష్ణప్రసాద్, బాజీ, వెంకటేష్, మునస్వామి, పవన్ తదితరులు పాల్గొన్నారు.



అగ్నిప్రమాదం జరిగిన గది వద్ద ఎమ్మెల్యే ఆరణి తదితరులు



మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను నాటక రూపంలో ప్రదర్శిస్తున్న వైద్య విద్యార్థులు

మహిళలకు రక్షణేదీ?

- స్విమ్స్‌లో కొనసాగుతున్న జూనియర్ డాక్టర్ల నిరసన

తిరుపతి(వైద్యం), ఆగస్టు 18: 'మహిళలకు రక్షణ లేకుండా పోతోంది. వయస్సుతో సంబంధం లేకుండా అఘాయిత్యాలు కొనసాగుతున్నాయి. చివరకు ప్రాణాలు కాపాడే మహిళా డాక్టర్లకు సైతం రక్షణ లేకపోవడం సమాజం సిగ్గుతో తలదించుకోవాల్సిన విషయం' అని స్విమ్స్‌లోని జూనియర్ డాక్టర్లు (జూడాలు) ఆవేదన వ్యక్తం చేశారు. కోల్‌కతాలోని ఆర్జీ కర్ వైద్య కళాశాలలో మహిళా జూనియర్ డాక్టరుపై జరిగిన హత్యాచార ఘటనకు సంబంధించి స్విమ్స్‌లోని జూడాలు నాలుగు రోజులుగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం మహిళలకు ప్రత్యేక రక్షణ చట్టాలు తీసుకురావడంతోపాటు హత్యాచారానికి గురైన జూనియర్ డాక్టరుకు న్యాయం చేయాలని వారు ప్లకార్డులు చేతపట్టి నిరసన తెలిపారు. అనంతరం సమాజంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను కళ్లకు కట్టినట్లు చూపిస్తూ పలు నాటక ప్రదర్శనలు నిర్వహించారు. వీటిని వీక్షించిన ఆస్పత్రిలోని రోగుల సహాయకుల మనస్సు చలించి, జూడాలకు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా స్విమ్స్ ఆర్‌డీఎస్ఏ (రెసిడెంట్ డాక్టర్స్ అండ్ స్టూడెంట్స్ అసోసియేషన్) నేతలు డాక్టర్ దీరజ్‌కుమార్, డాక్టర్ శివప్రసాద్ మాట్లాడుతూ.. ఇప్పటికే అనేక చోట్ల డాక్టర్లపై దాడులు జరిగిన ఘటనలు ఉన్నాయన్నారు. అయినా తమకు రక్షణ కల్పించే విధంగా ఎలాంటి చట్టాలను అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. వెంటనే ఈ ఘటనకు సంబంధించిన వారితోపాటు నిర్లక్ష్యంగా వ్యవహరించిన కళాశాల అధికారులను కూడా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



పూర్వ విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న గురువులు

పూర్వ విద్యార్థుల కలయిక

రామచంద్రాపురం, ఆగస్టు 18: మండలంలోని అనుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 2002-03 పదవ తరగతి విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఈ పాఠశాలలో పదవ తరగతి చదివి ఉన్నత విద్యను అభ్యసించి వివిధ రంగాల్లో స్థిరపడిన వీరంతా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఇందులో ఎక్కువ మంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ప్రభుత్వ, ప్రైవేటు, వ్యాపారాల్లో స్థిరపడ్డారు. మొత్తం బ్యాచ్‌లో 20మంది చదివారు. వారు ఆదివారం పాఠశాలలో కుటుంబ సమేతంగా హాజరయ్యారు. మధ్యాహ్నం విందు భోజనాలు చేసి ఉత్సహంగా గడిపారు. అనంతరం గురువులను ఘనంగా సన్మానించారు.

ప్రకృతి వ్యవసాయ సాగు పరిశీలన



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న విదేశీ బృందం

తిరుచానూరు, ఆగస్టు 18: తిరుపతి రూరల్ మండలం వేమూరులో అయ్యప్ప నాయుడు ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని ఆదివారం యూకేకు చెందిన ప్రొఫెసర్ ఫరెన్స్ సుధ్గన్ తన బృందంతో కలిసి ఆదివారం సందర్శించారు. పీఎండీఎస్ పంటలు, విత్తనాల కిట్లు, సీడ్ బాల్స్ ప్రత్యక్షంగా తయారు చేయడం, ఏటీఎం మోడల్ ఘన జీవామృతాన్ని అయ్యప్పనాయుడు ప్రత్యక్షంగా చేసి చూపించారు. ప్రకృతి వ్యవసాయ సార్వత్రిక సూత్రాలను వివరించారు. **రామచంద్రాపురం:** శ్రీరామపురం, కుప్పంబాదూరు, పున్నమనాయుడుకండ్రిగ, పాలేపల్లి గ్రామాల పరిధిలోని ప్రకృతి వ్యవసాయ తోటలను విదేశీ బృందంతోపాటు ఇతర రాష్ట్రాల ప్రతినిధులు పరిశీలించారు. సాగు విధానం గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి సాగు బాగుందని బృందం ప్రశంసించింది. అనంతరం డీపీఎం షణ్ముగం మాట్లాడుతూ ఏపీసీఎన్ఎఫ్, ఆర్‌వైఎస్ఎస్ ప్రాజెక్టు ద్వారా మండలంలో సాగవుతున్న పంటలను వెస్ట్‌బెంగాల్, బిహార్ రాష్ట్రాల ప్రతినిధులు పరిశీలించారన్నారు. ఈతరహా సాగును వారి రాష్ట్రాల్లో అమలుపరచనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషినల్ డీపీఎం పట్టాభిరెడ్డి, స్టేట్ సీనియర్ కన్సల్టెంట్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేరికోస్ వెయిన్స్‌పై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీహరి

తిరుచానూరు, ఆగస్టు 18: ప్రజల్లో రోజురోజుకూ పెరుగుతున్న కాళ్లలో సిరల వాపు (వేరికోస్ వెయిన్స్) నిర్ధారణ, నివారణకు మరిన్ని శిబిరాలు అవసరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి అన్నారు. తిరుచానూరులో ఆదివారం భువనేష్ కనస్ట్రక్షన్స్, డెవలపర్స్ ఆధ్వర్యంలో మెగా విన్ వాస్క్యులర్ కేర్ సంస్థ వేరికోస్ వెయిన్స్ ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ జనాభాలో సుమారు 20 శాతం మంది బాధితులు ఉన్నారన్నారు. ప్రభుత్వం దీనిపై అవగాహన చర్యలు చేపడుతోందన్నారు. పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భువనేష్ కనస్ట్రక్షన్స్, డెవలపర్స్ ఎండీ మల్లికార్జున్, వైద్యులు బాలశంకర్ రెడ్డి, విజయకుమార్, హరీష్‌రాజ్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రేడ్‌ల వారీగా బదిలీలు చేపట్టాలి



ఏపీ సర్వీసెస్ అసోసియేషన్ సభ్యులు

తిరుచానూరు, ఆగస్టు 18: గ్రేడ్ల వారీగా పంచాయతీలలో బదిలీలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ సర్వీసెస్ అసోసియేషన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు ఎం.హరిప్రసాద్‌రెడ్డి కోరారు. ఆదివారం తిరుచానూరులోని పంచాయతీ కార్యాలయంలో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రేడ్ 1 నుంచి గ్రేడ్ 5 వరకు వారి గ్రేడ్ల ప్రకారం ప్రభుత్వం బదిలీలు చేపట్టాలన్నారు. అసోసియేషన్ బలోపేతం వంటి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో సభ్యులు వెంకటేశ్వర్లు, ప్రభురెడ్డి, ఆనందబాబు, యూసఫ్‌ఖాన్, గిరిధర్‌రెడ్డి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

కోల్‌కతా ఘటనపై మహిళల నిరసన



పాకాల, ఆగస్టు 18: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం ఘటనపై స్థానిక సీఎస్ఐ సెయింట్ పాల్స్ చర్చి మహిళలు ఆదివారం క్యాండిల్స్‌తో నిరసన వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. మృతురాలి ఆత్మశాంతి కోసం ప్రార్థనలు చేశారు. ఇలాంటి ఘటనలు మానవజాతికే సిగ్గు చేటు అన్నారు. పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యురాలి కుటుంబానికి న్యాయం జరగాలని కోరారు. దారుణ హత్యాచారం హత్యకు పాల్పడిన మానవ మృగాలను ఉరితీయాలన్నారు. కార్యక్రమంలో స్త్రీల మైత్రి సంఘం కార్యదర్శి విమలా విక్టోరియా, చర్చిలోని మహిళలు పాల్గొన్నారు.



మంగళం: తిరుమలనగర్ నుంచి మంగళం ఆర్టీవో కార్యాలయం వరకు ఆదివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక టీడీపీ నాయకుడు మంగళం నాని ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీలో మహిళలు, యువతులు పాల్గొన్నారు. ఉపాధ్యాయురాలు పూజ మాట్లాడుతూ పటిష్ఠమైన చట్టాలను అమలు చేసి దేశ సంప్రదాయాలను భావి భారత పౌరులకు నేర్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో విజయ, ఆదిలక్ష్మి, హాసిని, నవీన్, వినోద్, సాయి తదితరులు పాల్గొన్నారు.

వాకర్లతో ఎమ్మెల్యే ఆరణి మాటామంతీ



మంగళం, ఆగస్టు 18: రోజూ ఉదయాన్నే నడవడం వల్ల ఆరోగ్యంగా ఉంటామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం ఉదయం అలిపిరి రోడ్డులోని దివ్యారామం పార్కులో ఎమ్మెల్యే వాకింగ్ చేస్తూ ప్రజలతో నియోజకవర్గ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ నడక వల్ల ఆరోగ్యం బాగుంటుందన్నారు. ఆయన వెంట జనసేన నాయకులు అర్కాట్ కృష్ణప్రసాద్, తమ్మినేని వెంకటేశ్వర్లు, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.02 కోట్లు

తిరుమల, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.02 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. శనివారం 77,807 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 38,340 మంది శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

తిరుమలలో నేడు పౌర్ణమిగరుడసేవ

తిరుమల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల క్షేత్రంలో సోమవారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా పౌర్ణమి గరుడ సేవ జరుగనుంది. ప్రతినెలా పౌర్ణమి సందర్భంగా గరుడసేవను టీటీడీ నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా రాత్రి ఏడు నుంచి తొమ్మిది గంటల మధ్య మలయప్పస్వామి విశేష అలంకరణలో తన ఇష్టమైన గరుడుడిపై కొలువుదీరి నాలుగుమాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను టీటీడీ పూర్తిచేసింది. ఇదే నెలలో గరుడ పంచమి సందర్భంగా గరుడవాహన సేవ జరిగిన విషయం తెలిసిందే. సోమవారం రెండోసారి శ్రీవారు గరుడ వాహనంపై భక్తులను అనుగ్రహించనున్నారు.

తిరుమల బాలాజీనగర్‌లో విస్తృత తనిఖీలు



బాలాజీనగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న విజిలెన్స్, పోలీసు అధికారులు

తిరుమల, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): తిరుమలలో వరుసగా జరుగుతున్న సంఘటనల నేపథ్యంలో విజిలెన్స్, పోలీసు అధికారులు ఆదివారం తనిఖీలు చేపట్టారు. అత్యంత రద్దీ ప్రదేశమైన నందకం వద్ద పట్టపగలు ఇద్దరు హాకర్లు గాజుబాటిళ్లతో ఒకరిపై ఒకరు దాడి చేసుకుంటూ రక్తగాయాలతో వీరంగం సృష్టించి భక్తులను భయభ్రాంతులకు గురిచేసిన విషయం తెలిసిందే. తిరుమలలో నిషేధిత మద్యం, పొగాకు ఉత్పత్తులు కూడా లభిస్తున్నాయనే సమాచారం నేపథ్యంలో భద్రతను పెంచేందుకు, అనధికార వ్యక్తులను గుర్తించి తరలించాలని టీటీడీ సీవీఎస్వో శ్రీధర్ ఆదేశించారు. ఈమేరకు విజిలెన్స్ వీఎస్వో సురేంద్ర ఆధ్వర్యంలో విజిలెన్స్, పోలీసులు అధికారులు, సిబ్బంది బాలాజీనగర్‌లో పాచికాల్వ గంగమ్మ ఆలయానికి సమీపంలో కూలీలు ఏర్పాటు చేసుకున్న షెడ్లపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. గతంలో తిరుమలలో వివిధ నిర్మాణ పనుల్లో కూలీలుగా పనిచేసిన వారి కోసం తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేశారు. పనులు పూర్తయినా చాలా మంది ఇప్పటికీ 70పైగా షెడ్లలో నివాసముంటున్నట్టు అధికారులు గుర్తించారు. ఇందులో గుర్తింపులేని అనధికార వ్యక్తులు కూడా ఉన్నట్టు తేలింది. ఈక్రమంలో కార్మికుల జాబితాను ధ్రువీకరణ కోసం ఇంజినీరింగ్ విభాగానికి కూడా పంపారు. అనధికారికంగా ప్రవేశించే వారిని నిలువరించేందుకు ఇకపై ఇలాంటి దాడులు నిరంతరాయంగా నిర్వహిస్తామని టీటీడీ అధికారులు తెలిపారు. అనధికారికంగా నివసిస్తున్న వ్యక్తులు, సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీలో విజిలెన్స్ ఏవీఎస్వోలో పద్మనాభం, సాయిగిరిధర్, శివయ్య, శైలేంద్ర, వీఐ శంకర్, పోలీసులు పాల్గొన్నారు.

సుపథం నుంచి దర్శనం కల్పించండి

- శ్రీనివాస దివ్యానుగ్రహ హోమ భక్తుల నుంచి పెరుగుతున్న ఒత్తిడి



అలిపిరిలో శ్రీనివాస దివ్యానుగ్రహ హోమం

తిరుమల, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): తమకు సుపథం నుంచి దర్శనం కల్పించాలంటూ శ్రీనివాస దివ్యానుగ్రహ హోమం భక్తుల నుంచి టీటీడీకి రోజురోజుకూ వినతులు పెరుగుతున్నాయి. తిరుమల భక్తులు ముందుగా గోమాతను దర్శించుకునేలా ఓదాత విరాళం రూ.15 కోట్లతో టీటీడీ అలిపిరిలో 'సప్త గోప్రదక్షిణ' మందిరాన్ని నిర్మించిన విషయం తెలిసిందే. 2022 నుంచి ఈ మందిరంలో గోపూజ, గోగ్రాసంతో తులాభారం, ప్రదక్షిణకు భక్తులను టీటీడీ అనుమతిస్తోంది. సనాతన హైందవ సంస్కృతిలో హోమానికి విశేష ప్రాధాన్యత ఉందనే ఉద్దేశంతో తిరుమలలో భక్తులు హోమాలు చేసుకోలేని నేపథ్యంలో గతేడాది నవంబరు 23 నుంచి అలిపిరిలోని సప్త గోప్రదక్షిణ మందిరంలో శ్రీనివాస దివ్యానుగ్రహ హోమం ప్రారంభించారు. రూ.వెయ్యితో టికెట్ కొనుగోలు చేసిన ఇద్దరు భక్తులు హోమంలో పాల్గొనవచ్చు. వీరు రూ.300 అదనంగా చెల్లిస్తే శ్రీవారి దర్శనం కల్పిస్తున్నారు. ఇలా రోజుకు 200 నుంచి 300 వరకు టికెట్లను కేటాయిస్తున్నారు. ఈదర్శనం టికెట్ కలిగిన భక్తులను వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం క్యూలైన్ నుంచి దర్శనానికి అనుమతిస్తున్నారు. వీరి నుంచి ఇటీవల కొత్త వినతి వినిపిస్తోంది. దివ్యానుగ్రహ హోమం కూడా ఆర్జితసేవేనని, తమను వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నుంచి కాకుండా సుపథం నుంచి అనుమతించాలంటూ టీటీడీని కోరుతున్నారు. ఇటీవల జరిగిన డయల్ యువర్ ఈవోలో కడపకు చెందిన ఓ భక్తుడు మాట్లాడుతూ ఈమేరకు విజ్ఞప్తి చేశారు. పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని ఈవో బదులిచ్చారు. తాము హోమంలో పాల్గొని అలసిపోతామని, సుపథం నుంచి అనుమతిస్తే త్వరగా దర్శనం చేసుకుంటామని ఇటీవల చాలామంది భక్తులు ఒత్తిడి తెస్తున్నారు.

గజలక్ష్మి నమోస్తుతే..



తిరుచానూరు, ఆగస్టు 18: తిరుచానూరులోని పద్మావతి అమ్మవారికి ఆదివారం రాత్రి వేడుకగా గజవాహనసేవ జరిగింది. అమ్మవారి జన్మనక్షత్రం ఉత్తరాషాడ పురస్కరించుకుని సుప్రభాతసేవతో మేల్కొపి అర్చకులు మూలమూర్తికి అభిషేకాలు నిర్వహించారు. సర్వాలంకార శోభితురాలైన పద్మావతి దేవి ఆదివారం రాత్రి తనకు ప్రీతిపాత్రమైన గజరాజుపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, ఏవీఎస్వో సతీష్‌కుమార్, సూపరింటెండెంట్లు చంద్రశేఖర్, శేషగిరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు గణేష్, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

→ గజవాహనంపై ఊరేగుతున్న అమ్మవారు

ఆకట్టుకున్న బకాసుర వధ



అన్నంబండితో భీమునిపాత్ర వేషధారి

రామచంద్రాపురం, ఆగస్టు 18: ఎన్ఆర్ కమ్మపల్లిలో మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం భాగవతారిణి సీతాలక్ష్మి ప్రదర్శించిన బకాసుర వధ హరికథ సభికులను అలరించింది. గ్రామానికి చెందిన మునిరత్నంనాయుడు సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. వివిధ గ్రామాల నుంచి సేకరించి బండెడు అన్నంతో భీమపాత్ర వేషధారి ఆలయానికి చేరుకోవడం అలరించింది. సాయంత్రం ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఉత్సవమూర్తుల ఊరేగింపు వైభవంగా జరిగింది. అంతకుముందు ఆలయంలో మూలమూర్తులకు తిరుమంజనం నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మకర్త రమేష్‌బాబు, రవికుమార్ పాల్గొన్నారు.



నృత్యంచేస్తున్న చిన్నారులు

అలరించిన జానపద కళలు

తిరుచానూరు, ఆగస్టు 18: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం తిరుపతికి చెందిన కొండ రవి ఆధ్వర్యంలో 70మంది కళాకారుల బృందం జానపద నృత్యాలు ప్రదర్శించింది. కోయనృత్యం, కోలాటం, వెంకీ, పల్లె జానపదాలు పలు నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అంతకుముందు కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. ఈ కళాకారులను శిల్పారామం ఏవో ఖాదరవల్లి సత్కరించారు. జ్ఞాపికలు అందజేశారు.



దుర్యోధన వధ నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు

ముగిసిన మహాభారత ఉత్సవం

తిరుపతి రూరల్, ఆగస్టు 18: తిరుపతి రూరల్ మండలం పాతకాల్వ గ్రామంలోని ధర్మరాజస్వామి ఆలయంలో 12రోజులపాటు నిర్వహించిన ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి మహాభారత ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. సాయంత్రం అగ్నిగుండ ప్రవేశ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు అగ్నిగుండ ప్రవేశం చేసి మొక్కులు చెల్లించారు. భక్తులకు అన్నదానం చేశారు. శ్రీవేంకటేశ్వర నాట్య కళామండలి ఆధ్వర్యంలో ప్రదర్శించిన దుర్యోధన వధ నాటకం చూపరులకు విశేషంగా ఆకట్టుకుంది. సోమవారం స్వామివారికి పట్టాభిషేక మహోత్సం జరగనుంది. ఆలయధర్మకర్తలు, ఉభయదారులు, కమిటీసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్ఐగా ఎర్రిస్వామి బాధ్యతల స్వీకారం



ఎర్రావారిపాలెం, ఆగస్టు 18; ఎర్రావారిపాలెం పోలీస్ సబ్-ఇన్‌స్పెక్టర్‌గా డి. ఎర్రిస్వామి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకూ ఇక్కడ ఈశ్వరయ్య పనిచేశారు. ఈ సందర్భంగా ఎర్రిస్వామి మాట్లాడుతూ మండలంలో గంజాయి విక్రయం,వినియోగం,ఎర్ర చందన స్మగ్లింగ్ కట్టడికి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ప్రజలు ఎప్పటికప్పుడు తమకు సమాచారం అందించాలని కోరారు.

తిరుమలేశుడి సేవలో ప్రముఖులు



తనూజారాణి



తమన్



పీఎంఎస్ ప్రసాద్

తిరుమల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఎంపీ తనూజారాణి, రిలయన్స్ సంస్థ సీఈవో పీఎంఎస్ ప్రసాద్, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, సినీ సంగీత దర్శకుడు తమన్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

శాస్త్ర సాంకేతిక రంగాల్లో యువత రాణించాలి



ప్రయోగ నమూనాలతో విద్యార్థులు - అంతరిక్ష దిన వేడుకలకు హాజరైన వివిధ పాఠశాలల విద్యార్థులు

ఏర్పేడు, ఆగస్టు 18: శాస్త్ర సాంకేతిక రంగాల్లో యువత రాణించాలని టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ రోషన్ శ్రీవాస్తవ విద్యార్థులకు సూచించారు. తిరుపతి ఐఐటీలో జరుగుతున్న అంతరిక్ష దిన వేడుకలు ఆదివారంతో ముగిశాయి. పలు కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వివిధ రకాల సైన్స్ ప్రయోగాలను ప్రదర్శించారు. మొత్తం 75మంది విద్యార్థులు క్విజ్, ప్రసంగం, పోస్టర్ ప్రదర్శన వంటి పోటీల్లో పాల్గొన్నారు. వీరందరికీ ఐఐటీ అధికారులు ప్రశంసాపత్రాలను అందించారు. కార్యక్రమంలో ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మహేష్‌కుమార్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

21న మహతిలో తేజస్విని కూచిపూడి రంగ ప్రవేశం

మంగళం, ఆగస్టు 18: యూకేలో కూచిపూడి నాట్యంలో శిక్షణ పొందిన తేజస్విని తిరుపతి మహతి ఆడిటోరియంలో ఈ నెల 21వ తేదీన కూచిపూడి రంగ ప్రవేశ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె తండ్రి తిరుపతికి చెందిన ఉదయ్‌శంకర్ తెలిపారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... కూచిపూడి నాట్యంపై మక్కువ ఉన్న తేజస్విని యూకేలో 9వ తరగతి చదువుతున్నప్పటి నుంచి గురువు విశ్వమోహన్ వద్ద శిక్షణ పొందిందన్నారు. ఈ కార్యక్రమం సాయంత్రం 4 నుంచి 8.30గంటల వరకు జరుగుతుందన్నారు. కళాకారులు, ప్రజలు విచ్చేసి ఆశీర్వదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

భూమి కాజేసేందుకు దౌర్జన్యం

- ఓ వ్యక్తి ఆగడాలపై మహిళల వేదన



గాయపడిన తల్లి ఫొటోలను చూపుతున్న బాధితులు

మంగళం, ఆగస్టు 18: తమకు గతంలో విక్రయించిన భూమిని సొంతం చేసుకోడానికి ఓ వ్యక్తి దౌర్జన్యం చేస్తున్నాడంటూ బాధితులు వాపోతున్నారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బాధితులు మధురవాణి, రెడ్డెమ్మలు విలేకరుల సమావేశంలో చెప్పిన వివరాలిలా.. ఎర్రావారిపాళెం ఎనమలవారిపల్లెకి చెందిన రఘునాథరెడ్డి నుంచి 1988లో 3.76 ఎకరాల భూమిని తాము కొనుగోలు చేశామన్నారు. తాజాగా రఘునాథరెడ్డి కుమారుడు విజయ్‌కుమార్‌రెడ్డి ఈ పొలాన్ని తిరిగి సొంతం చేసుకోవాలని దౌర్జన్యానికి దిగుతున్నాడని పేర్కొన్నారు. ఈనేపథ్యంలో అతను ఆదివారం తమ తల్లి సరస్వతమ్మను బలంగా నెట్టివేశాడన్నారు. గాయపడిన ఆమె చికిత్స పొందుతోందని వారు వాపోయారు. తరచూ గొడవలకు దిగుతూ విద్యుత్ పరికరాలను కూడా ఎత్తుకెళ్లిపోతున్నాడన్నారు. ఇతని ఆగడాలపై పోలీసులను ఆశ్రయించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సంబంధిత ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు స్పందించి విజయ్‌కుమార్‌రెడ్డిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు.

రాఘవేంద్రస్వామికి టీటీడీ శేషవస్త్రం సమర్పణ



శేషవస్త్రం తీసుకువస్తున్న ఈవో శ్యామలరావు దంపతులు

తిరుమల, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా మంత్రాలయం గురురాఘవేంద్రస్వామి 353వ ఆరాధన మహోత్సవాల సందర్భంగా టీటీడీ తరఫున ఈవో శ్యామలరావు దంపతులు ఆదివారం శేషవస్త్రం సమర్పించారు. హైందవ సనాతన ధర్మవ్యాప్తి కృషి చేసిన సద్గురువుల భగవత్ సేవల దృష్ట్యా 2006 నుంచి రాఘవేంద్రస్వామికి శ్రీవారి శేషవస్త్రాన్ని టీటీడీ సమర్పిస్తోంది. సాక్షాత్తూ వేంకటేశ్వరస్వామి కృపతో రాఘవేంద్రస్వామి జన్మించారు. రాఘవేంద్రస్వామి పూర్వాశ్రమ నామధేయం కూడా వెంకన్నభట్టు. వెంకటాచార్యగా ప్రశస్తి. ఈక్రమంలో ముందు మంత్రాలయంలోని రాఘవేంద్రస్వామి మఠాధిపతి సుబుదేంద్రతీర్థ స్వామికి ఈవో శ్యామలరావు శేషవస్త్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా పీఠాధిపతి ఈవో దంపతులను ఆశీర్వదించారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

- యువకుడి దుర్మరణం



హర్షవర్ధన్ (ఫైల్‌ఫొటో)

ఏర్పేడు, ఆగస్టు 18: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందిన ఘటన ఆదివారం ఏర్పేడు మండలంలో చోటు చేసుకుంది. సీఐ శ్రీరామ శ్రీనివాసులు కథనం మేరకు.... శ్రీకాళహస్తి మండలం చల్లపాళెం గ్రామానికి చెందిన వంకాయలపాటి హర్షవర్ధన్(26) ద్విచక్ర వాహనంపై సొంత పనుల నిమిత్తం స్వగ్రామం నుంచి తిరుపతికి బయలుదేరాడు. ఏర్పేడు మండలం సీతారాంపేట వద్ద తిరుపతి నుంచి గూడూరుకు వెళుతున్న కారు హర్షవర్ధన్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో హర్షవర్ధన్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని హర్షవర్ధన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కిక్కిరిసిన ముక్కంటి ఆలయం



శ్రీకాళహస్తి, ఆగస్టు 18: శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. వారాంతపు సెలవులు కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 26వేలమంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఇందులో రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 1,159 మంది, రూ.50 ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,624 మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 టిక్కెట్ల ద్వారా 2,501మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 864, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 265మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 243మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 64మంది భక్తులు రాహుకేతు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 15,909 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

నిద్రిస్తున్న డ్రైవర్‌పైకి దూసుకెళ్లిన లారీ

బిహార్‌వాసి మృతి

ఏర్పేడు, ఆగస్టు 18: మండంలోని డిక్సన్ పరిశ్రమ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందాడు. బిహార్ రాష్ట్రానికి చెందిన లారీ డ్రైవర్ ప్రమోద్ రామ్ తమిళనాడు రాష్ట్రానికి చెందిన సంజయ్‌కుమార్ రాయ్, సురేష్‌బాబుతో కలిసి చెన్నై నుంచి లారీలో ఎల్ఈడీ టీవీ మెటీరియల్‌ను ఏర్పేడు మండంలోని డిక్సన్ కంపెనీకి తీసుకొచ్చారు. ఆదివారం కావడంతో అన్‌లోడ్ చేయలేదు. మధ్యాహ్నం ముగ్గురు మద్యం తాగారు. సంజయ్‌కుమార్ క్యాబిన్‌లో పడుకోగా ప్రమోద్‌రామ్ రోడ్డు మార్జిన్‌లో పడుకున్నారు. అయితే రోడ్డు మార్జిన్‌లో నిద్రిస్తున్న ప్రమోద్‌రామ్(43)పైకి లారీ వెళ్లడంతో అతను తల పగలి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం జరిగిన తీరును పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లారీ హ్యాండ్‌లాక్ ఓపెన్ కావడం వల్ల ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు.



అరసం కవితా స్రవంతి
పుస్తకాల ఆవిష్కరణ

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 18: విద్యార్థి లోకాన్ని సాహిత్య పఠనం వైపు తీసుకురావడానికి చేస్తున్న ప్రయత్నంలో భాగమే కవితా స్రవంతి పుస్తకాల ప్రచురణ అని ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జాతీయ సమితి అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవనంలో జరిగిన పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. కొత్త తరం కోసం గతంలో కథాస్రవంతి పేరిట పలువురి కథలను ప్రచురించామన్నారు. అనంతరం ఆయన అవంత్స సోమసుందర్ కవిత్వాన్ని పరిచయం చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య మధురాంతకం నరేంద్ర.. నాగభైరవ కోటేశ్వరరావు కవిత్వాన్ని, విశ్రాంత ఆచార్యులు మేడిపల్లి రవికుమార్.. ఆలూరి బైరాగి కవిత్వాన్ని, అరసం రాష్ట్ర నాయకులు సాకం నాగరాజ.. గరిమెళ్ల సత్యనారాయణ కవిత్వంపై మాట్లాడారు. అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ.. విలువలు పతనమౌతున్న నేటికాలంలో సాంస్కృతిక పునర్వికాసం అవసరాన్ని వివరించారు. తెలుగునాట అరసం ఎనిమిది దశాబ్దాలుగా సామాజిక చైతన్యం కోసం కృషి చేస్తోందని కథా రచయిత మూరిశెట్టి గోవిందు అన్నారు. అవంత్స సోమసుందర్ కవిత, నాగభైరవ కోటేశ్వరరావు కవిత, ఆలూరి బైరాగి కవిత, గరిమెళ్ల సత్యనారాయణ కవిత అనే నాలుగు పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అరసం తిరుపతి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యువశ్రీ మురళి, నెమిలేటి కిట్టన్న, పల్లిపట్టు నాగరాజు, పేరూరు బాలసుబ్రమణ్యం, తోట వెంకటేశ్వర్లు, ఆకుల మల్లేశ్వరరావు, రాసాని, మల్లారపు నాగార్జున, మేఘనాథరెడ్డి, సుభద్ర, నడ్డి నారాయణ, ఏనుగు అంకమనాయుడు, జి.గోవిందయ్య పాల్గొన్నారు.

టీటీడీ పరిపాలన భవనంలో
అగ్నిప్రమాదం వెనుక వైసీపీ హస్తం

తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడి ఆరోపణ

మంగళం, ఆగస్టు 18: టీటీడీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పరిపాలనా భవనంలో అగ్నిప్రమాదం జరగడం వెనుక వైసీపీ నేతల హస్తం ఉందని తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్ ఆరోపించారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ హయాంలో జరిగిన అక్రమాలపై కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించిందన్నారు. దీంతో అవినీతి ఎక్కడ బయటపడుతుందోనని వాటికి సంబంధించిన దస్త్రాలను అగ్నిప్రమాదాలను సృష్టించి దగ్ధం చేసే కార్యక్రమం జగన్ కనుసన్నల్లోనే జరుగుతోందని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో వేల ఎకరాల ప్రభుత్వ భూములను తమవారికి కట్టబెట్టడానికి కుట్రలు చేశారన్నారు. టీటీడీలో జగన్ మొదట్లో తన బాబాయిని, తిరుపతి మాజీ ఎమ్మెల్యే కరుణాకర్‌రెడ్డిని, ధర్మారెడ్డిని నియమించుకుని భారీ అక్రమాలకు తెరతీశారన్నారు. కరుణాకర్‌రెడ్డి తన కుమారుడిని ఎమ్మెల్యేగా గెలిపించుకోవడానికి టీటీడీ నిధులు రూ.1,700 కోట్లు సివిల్ వర్కులకు కేటాయించారన్నారు. శ్రీవాణి ట్రస్టు పేరుతో వసూలు చేసిన నిధులతో ఏ పనులు చేశారో అన్నింటిపై విచారణ జరుగుతోందన్నారు. చంద్రగిరి నియోజకవర్గానికి తుడా నిధులు, స్మార్ట్‌సిటీ నిధులు దుర్వినియోగమయ్యాయని ఆరోపించారు. టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయుడు మాట్లాడుతూ.. ఇటీవలే టీటీడీ ఇంజనీరింగ్ విభాగ ఉద్యోగులకు విజిలెన్స్ అధికారులు నోటీసులు ఇచ్చారని, వారి బండారం బయటపడుతుందనే ఫైళ్లను దగ్ధం చేశారని అనుమానం వ్యక్తం చేశారు. విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. టీడీపీ పార్లమెంటు కార్యాలయ కార్యదర్శి మనోహరాచారి, చెంగయ్య, తోట వాసు,రంజిత్ పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న నరసింహ యాదవ్

క్రీడలతో శారీరక, మానసికోల్లాసం



మైదానంలో ఎస్‌జీఎస్టీ అధికారులు, సీఏలు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 18: క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎస్‌జీఎస్టీ జాయింట్ కమిషనర్ (చిత్తూరు డివిజన్ నోడల్ అధికారి) జాన్‌స్టీవన్సన్‌పాత్ర, ఐసీఏఐ తిరుపతిశాఖ ఛైర్మన్ రవీంద్రరెడ్డి, కార్యదర్శి సింహాద్రి నాయుడు తెలిపారు. స్థానిక ఎస్వీ ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఆదివారం ఉదయం ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టెడ్ అకౌంట్ ఆఫ్ తిరుపతి ఆధ్వర్యంలో జిల్లా పరిధిలోని ఎస్‌జీఎస్టీ-తిరుపతి సీఏల మధ్య ఒక రోజు క్రికెట్ మ్యాచ్‌లు జరిగాయి. రెండు మ్యాచ్‌లు జరగగా చెరొక జట్టు విజయం సాధించి సంయుక్త విజేతలుగా నిలిచాయి. ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. రోజువారి కార్యక్రమాల నుంచి విరామం కల్పించడంతో పాటు ఒత్తిడిని జయించడానికి క్రికెట్ మ్యాచ్‌లు ఎంతో దోహదపడుతాయని తెలిపారు. సీజీఎస్టీ అధికారులు, సీఏలమధ్య స్నేహపూర్వక సంబంధాలు మరింత మెరుగుపడుతాయని చెప్పారు. జీఎస్టీ నిర్వహణలో సీఏల పాత్ర చాలా ముఖ్యమైందని అన్నారు.

ఫైళ్ల దగ్ధంపై వారంలో ప్రకటన చేయాలి

● కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్

మంగళం, ఆగస్టు 18: 'టీటీడీ ఇంజనీరింగ్ కాంట్రాక్టుల్లో రూ.100కోట్లు చేతులు మారాయని, టీటీడీ పరిపాలన భవనంలో దగ్ధమైన ఫైల్స్ ఇందుకు సంబంధించినవేమోనని అనుమానంగా ఉంది. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి వారంలో స్పష్టమైన వాస్తవాలను ప్రకటించాలి. లేనిపక్షంలో రోడ్లపైకి వచ్చి నిరసిస్తాం' అని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ హెచ్చరించారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ఎంతోమంది భక్తులు శ్రీవారికి సమర్పించే కానుకలను స్వలాభం కోసం దుర్వినియోగం చేశారని ఆరోపించారు. బ్రేక్ దర్శనాలు, శ్రీవాణి ట్రస్టులో భారీగా అవినీతి జరిగిందన్నారు. రోజూ టీటీడీకి సంబంధించిన ప్రతి నిర్ణయాన్ని ప్రజలు, శ్రీవారి భక్తులకు తెలిసేలా పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలన్నారు. గత ముఖ్యమంత్రులు, ప్రస్తుత ముఖ్యమంత్రితోసహా పోలవరానికి ఎన్ని నిధులు వచ్చాయి.. ఎంత ఖర్చు పెట్టారనే అంశంపై ఇప్పటి వరకు నోరు విప్పలేదన్నారు. ఆర్టీసీ బస్సులు దారుణంగా ఉన్నాయని, క్లీనర్లను ఏర్పాటు చేసి శుభ్రపరచాలని కోరారు. జగన్ పరిపాలనలో టీటీడీలో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపి, దోషులను బయటపెట్టాలని డిమాండ్ చేశారు.



ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలుకు కృషి చేయండి

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి ఆపస్ వినతి

తిరుపతి(విద్య), ఆగస్టు 18: ఉపాధ్యాయ ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలుకు కృషి చేయాలని ఆపస్ నాయకులు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిని కోరారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆమెను కలిసిన వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆపస్ రాష్ట్ర అధ్యక్షులు శవన్నగారి బాలాజీ మాట్లాడుతూ... ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలుచేసి జూనియర్ లెక్చరర్లు, డైట్ లెక్చరర్లు, మండల విద్యాశాఖ అధికారుల, డీవైఈఓ తదితర ప్రమోషన్లను చేపట్టాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం నూతన పెన్షన్ అమలు తేదీకంటే ముందునాటి నోటిఫికేషన్ ప్రకారం నియమితులైన ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాల్సిందేనని, ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న సుమారు 10,500 మందికి పాత పెన్షన్‌ను అమలు చేసేందుకు కృషి చేయాలని కోరారు. సీపీఎస్ రద్దు, 117 జీవో రద్దుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ సత్యనారాయణ, మహిళా కన్వీనర్ పి.పద్మ పాల్గొన్నారు.



పురందేశ్వరికి వినతిపత్రం ఇస్తున్న ఆపస్ నేతలు

తప్పు చేసిన వారికి శిక్ష తప్పదు: బీజేపీ

మంగళం, ఆగస్టు 18: 'టీటీడీలో వైసీపీ ప్రభుత్వం చేసిన అవినీతి, కుంభకోణాలు బయటపడతాయనే భయంతోనే ఫైళ్లు దగ్ధం చేస్తున్నారు. తప్పు చేసిన వారికి కఠిన శిక్షలు తప్పవు' అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధులు భానుప్రకాష్‌రెడ్డి, సామంచి శ్రీనివాసులు హెచ్చరించారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ.. టీటీడీ ఫైల్స్ దగ్ధం కావడం గతంలో తాము ఎన్నడూ చూడలేదన్నారు. 2019నుంచి 2024వరకు గత వైసీపీ ప్రభుత్వం భారీగానే టీటీడీలో, రాష్ట్రంలో దోచుకుందన్నారు. ఫైల్స్ దగ్ధం వెనుక ఎవరెవరు ఉన్నారో అందరూ జైలుకు పోవడం ఖాయమన్నారు. బీజేపీ నాయకులు వరప్రసాద్, డాక్టర్ శ్రీహరిబాబు తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న భానుప్రకాష్‌రెడ్డి

క్యాన్సర్ నివారణకు త్వరలో టీకా : ఎమ్మెల్యే



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 18: ప్రాణాంతక వ్యాధుల్లో ఒకటైన క్యాన్సర్ నివారణకు త్వరలోనే ప్రత్యేక టీకా అందుబాటులోకి రానుందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. కమ్యూనిటీ పారామెడిక్స్, ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అన్నమయ్య సర్కిల్లో నిర్వహించిన క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీని బీజేపీ అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం సాయంతో ఎన్డీయే ప్రభుత్వం త్వరలోనే క్యాన్సర్ నివారణ టీకాను అందుబాటులోకి తీసుకువస్తుందని ఆయన తెలిపారు. ప్రజల ఆరోగ్య భద్రతకు సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారన్నారు. అనంతరం క్యాన్సర్ అవగాహన ర్యాలీని యూత్ హాస్టల్ వరకు కొనసాగించారు. పలువురు నేతలు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్రప్రదేశ్ కోసం శ్రమిస్తున్న సీఎం చంద్రబాబు

మంత్రి వాసంశెట్టి సుభాష్



తిరుమల, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి):'స్వర్ణాంధ్రప్రదేశ్‌ను నిర్మించేందుకు సీఎం చంద్రబాబు పడుకోవడం లేదు.. మమ్మల్నీ నిద్రపోనివ్వడం లేదు. అంతగా శ్రమిస్తున్నారు' అని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. అధికారంలో వచ్చినప్పటి నుంచి సీఎం ప్రజల కోసం శ్రమిస్తున్నారన్నారు. సీఎం చేస్తున్న కృషికి స్వామి ఆశీస్సులు ఉండాలని ప్రార్థించానన్నారు. త్వరలోనే స్వర్ణాంధ్రప్రదేశ్‌ను చూడబోతున్నామన్నారు.

ఈ శతాబ్దపు మార్గదర్శకుడు రాజీవ్‌గాంధీ

- కేంద్ర మాజీమంత్రి మణిశంకర్ అయ్యర్

తిరుపతి రూరల్, ఆగస్టు 18: భారత దేశ ఏడవ ప్రధానమంత్రిగా దివంగత రాజీవ్‌గాంధీ అనిర్వచనీయమైన సేవలందించి.. దార్శనికత, వినూత్న సంస్కరణల ద్వారా సరికొత్త అధ్యాయాన్ని నెలకొల్పారని కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ మాజీ మంత్రి మణిశంకర్ అయ్యర్ పేర్కొన్నారు. రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని భారత గ్రామీణ అధ్యయనం, పరిశోధనా అకాడమీ(అగ్రశ్రీ) ఆధ్వర్యంలో ఆదివారం 21వశతాబ్దపు భారతదేశ రూపకల్పనలో రాజీవ్‌గాంధీ దూరదృష్టి, కృషి అనే అంశంపై ఆన్‌లైన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. న్యూఢిల్లీకి చెందిన ఇగ్నో మాజీ వీసీ ఎం.అస్లాం, డాక్టర్ డబ్ల్యూఆర్‌రెడ్డి, సందీప్ శాస్త్రి, ప్రొఫెసర్ మదన్‌మోహన్ గోయెల్ మాట్లాడుతూ.. 21వ శతాబ్దంలో భారతదేశాన్ని మార్చడానికి వివిధ రంగాలలో తీసుకొచ్చిన బహుపరిణామ సంస్కరణలను వివరించారు. భారత ప్రణాళిక సంఘ మాజీ డిప్యూటీ ఛైర్మన్ డాక్టర్ మాంటెక్ సింగ్ అహ్లువాలియా మాట్లాడుతూ.. దేశ ఆర్థిక సంస్కరణలకు రాజీవ్ చేసిన కృషిని ప్రశంసించారు. అగ్రశ్రీ వ్యవస్థాపక సంచాలకుడు డాక్టర్ డి.సుందరరామ్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జె.మురళి, వెంకట్రావ్ వై.ఘోర్పడే, ప్రొఫెసర్ ఎం.గోపీనాథ్‌రెడ్డి, ప్రొఫెసర్ కె.గిరీశన్, అగ్రశ్రీ సహాయ సంచాలకులు డి.సాయికుమార్, డి.సుచరిత పాల్గొన్నారు.



ఆన్‌లైన్‌లో మణిశంకర్ అయ్యర్, వక్తలు

చిన్నపిల్లలకు అత్యవసర వైద్యంపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణులు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 18: చిన్నపిల్లలకు అత్యవసర వైద్యం అందించడమనేది వైద్య రంగంలో ఎంతో కీలకమని, ఈ విషయంలో చిన్నపిల్లల వైద్యులు అప్రమత్తంగా ఉండాలని రుయా చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ మనోహర్ అన్నారు. రుయాస్పత్రిలోని చిన్నపిల్లల విభాగంలో అత్యవసర సమయంలో చిన్నపిల్లలకు అందించవలసిన చికిత్సపై ఆదివారం వైద్యులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు రాష్ట్రాలకు చెందిన చిన్న పిల్లల వైద్య నిపుణులు పాల్గొన్నారు.

కోటా జేఈఈ, నీట్-2025
డిజిటల్ మెటీరియల్ సిద్ధం

తిరుపతి(విద్య), ఆగస్టు 18: కోటా జేఈఈ, నీట్-2025 ప్రవేశ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకోసం కోటా డిజిటల్ మెటీరియల్‌ను సిద్ధం చేసినట్టు ఐఐటీ, జేఈఈ, నీట్ ఫోరం ఆదివారం ఓ ప్రకటకనలో తెలిపింది. కాన్‌సెప్ట్స్, మల్టీపుల్ చాయిస్ ప్రశ్నలు, కోటా గ్రాడ్ టెస్ట్స్, సొల్యూషన్స్, కోటా మునుపటి టెస్ట్ సొల్యూషన్స్, ర్యాంక్ బూస్టర్ టెస్ట్‌లు, ఎన్‌సీఈఆర్‌టీ నీట్ క్వశ్చన్ బ్యాంక్‌ను డిజిటల్ రూపంలో వాట్సాప్ ద్వారా పొందొచ్చని పేర్కొన్నారు. మెటీరియల్ కావలసినవారు నీట్-2025 అని, జేఈఈ విద్యార్థులు జేఈఈ-2025 అని టైప్‌చేసి 98490 16661 నెంబర్ వాట్సాప్‌కు మెసేజ్ చేయాలని సూచించారు.

15మంది 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు

ఐదు గొడ్డళ్ల స్వాధీనం



పట్టుబడ్డ స్మగ్లర్లతో టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, ఆగస్టు 18: ఎర్రచందనం దుంగలకోసం అడవిలోకి చొరబడుతున్న 15మంది స్మగ్లర్లను ఆదివారం టాస్క్‌ఫోర్సు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి ఒక బ్యాగ్, పిడిలేని గొడ్డళ్లను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఇన్‌చార్జి, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడి ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ(రిజర్వుడ్) సురేష్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో ఆర్ఎస్ఐ విశ్వనాథం బృందం తిరుపతి సమీపంలోని మంగళం నుంచి కరకంబాడి మీదుగా బాలపల్లి వైపు కూంబింగ్ చేపట్టారు. ఆదివారం ఉదయం టీఎన్‌పాళెం సెక్షన్ కరకంబాడి సమీపంలోని వెంకటేశ్వరస్వామి ఆలయం వైపు ఉన్న నిషేధిత అటవీ ప్రాంతంలో కొంతమంది వ్యక్తులు వెళుతూ కనిపించారు. వారిని హెచ్చరించి చుట్టుముట్టగా కొందరు పారిపోయారు. వారిలో 15మందిని అదుపులోకి తీసుకోగలిగారు. వారిని తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై జిల్లా జమనామత్తూరుకు చెందిన అరుల్(26), ఆనందన్ గోపాల్(26), సేతు అన్నామలై(27), జయమణి(29), చక్రవర్తి(36), శివలింగంరామన్(40), కుప్పుస్వామి కొలంధై(28) రంజిత్ మాణిక్యం(24), కుప్పన్ గోవిందన్(48), గోవిందరాజ్ అరుణాచలం(49), శిలింగం మొట్టియన్(38), ఏలుమలై(42), సంతోష్ సెల్వరాజ్(20), మహేంద్రన్ గోవిందన్(29), జయవేలు(26)గా గుర్తించారు. వీరి నుంచి ఐదు పిడిలేని గొడ్డళ్లు, ఒక బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీరిని తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీసుస్టేషన్‌కు తరలించి సీఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించండి

కార్గోలో కీలక పాత్ర పోషిస్తున్నా ఛార్జీలు వసూలు చేస్తున్నారని హమాలీల ఆవేదన





భారీ వస్తువులను రిక్షాలో బస్సు వద్దకు తీసుకొస్తున్న హమాలీ, బరువైన మూటను తీసుకెళుతున్న హమాలీ

తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 18: సొంతింటికి అద్దె తప్పక చెల్లించాల్సిందే అన్న చందంగా ఉంది ఆర్టీసీ హమాలీల పరిస్థితి. కార్గో వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తూ అధిక ఆదాయానికి తమ వంతుగా శ్రమిస్తున్నా.. విధులకు హాజరయ్యే క్రమంలో ఆర్టీసీ బస్సుల్లో ఛార్జీలు మాత్రం చెల్లించాల్సి వస్తుంది. సంస్థ ఉచిత ప్రయాణం కల్పించకపోగా కండక్టర్లచే బలవంతంగా వసూలు చేయిస్తోంది. ఈక్రమంలో తరచూ హమాలీలు, కండక్టర్ల మధ్య వాగ్వాదాలు జరుగుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించాలంటూ ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా హమాలీలు ఆర్టీసీ ప్రధాన కార్యాలయ అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. ప్రతి బస్టాండులో హమాలీలు 24గంటలు అందుబాటులో ఉండి ప్రయాణికులకు సేవలందిస్తున్నారు. తమ సొంత గ్రామాల రాకపోకలకు ఆర్టీసీ బస్సుల్లో ఛార్జీలు చెల్లిస్తూనే ఉన్నారు. ఉచిత ప్రయాణ అవకాశం కల్పించాలని విజ్ఞప్తులు చేస్తున్నా ఆర్టీసీ యంత్రాంగం పట్టించుకోవడం లేదు. 2017లో కార్గో వ్యవస్థను ప్రవేశపెట్టారు. ప్రయాణికుల సేవలతో పాటు అదనంగా లగేజీలను బస్సుల నుంచి దించడం, ఎక్కించడం, మోసుకురావడం, తీసుకెళ్లడం వంటి శ్రమతో కూడుకున్న పనులు చేస్తున్నారు. శ్రమకు తగిన ఆర్జితం స్వీకరిస్తున్నారు. ఏటేటా కార్గోలో పనిభారం, అదే స్థాయిలో ఆదాయమూ పెరుగుతోంది. వీరి సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 98మంది హమాలీలున్నారు. ప్రతి డిపోలోనూ షిఫ్టుల ప్రకారం కార్గో, ప్రయాణికులకు సేవలందిస్తున్నారు. సమీప డిపోల్లోనే పనిచేస్తున్నారు. ఆర్టీసీ అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు కూలీలకు కూడా దాదాపు 20కిలోమీటర్ల వరకు ఉచిత ప్రయాణం కల్పించారు. సంస్థకు ఆదాయం సమకూర్చడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న హమాలీలకు మాత్రం చార్జీల పేరిట దండన విధిస్తుండటం బాధాకరం.

ఉచిత ప్రయాణం కల్పించండి

- వెంకటేశ్(హమాలీల సంఘం జిల్లా కార్యదర్శి)



బస్టాండులో రాత్రనక పగలనక క్షణం తీరికలేకుండా కార్గో, ప్రయాణికులకు సేవలందిస్తున్నాం. తమ వల్ల సంస్థకు మంచే జరుగుతోంది. పనికి రావడానికి, పోవడానికి ఆర్టీసీ బస్సుల్లో ఉచితం కల్పించాలి. చీపుర పనులు చేసుకుంటున్న వారికి కూడా ఉచిత ప్రయాణం ఇచ్చారు. వచ్చే కూలీలో కొంత నగదు ఛార్జీలకే సరిపోతోంది. 50మందిలో తాము ఒకరు మాత్రమే ప్రయాణిస్తాం. బస్సుకు భారం కాము. ఉచిత సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ యాజమాన్యాన్ని వేడుకుంటున్నాం.

హమాలీల సమస్యను పైఅధికారుల దృష్టికి తీసుకెళ్తా

- కమర్షియల్ ఏటీఎం రామచంద్ర నాయుడు



బస్టాండుల్లో పనిచేస్తున్న హమాలీల ఉచిత ప్రయాణం సమస్యను పై అధికారుల దృష్టికి తీకెళ్తా. ఈ విషయాన్ని వివరించి, న్యాయం చేయమని కోరుతా. అంతవరకు హమాలీలు సహకరించాలి. సంయమనం పాటించాలి. కండక్టర్లతో వాదోపవాదాలు వద్దు. అంతగా ఇబ్బందిగా ఉంటే ప్రయాణిస్తున్న బస్సులో నుంచే తనకు ఫోన్ చేయాలి.

దందాలు చేసేది వైసీపీవాళ్లే: టీడీపీ


మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కోట, ఆగస్టు 18: ఐదేళ్ల పరిపాలన సాగించిన వైసీపీ నాయకులు కోట మండలంలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి దందాలకు పాల్పడ్డారని అలాంటి సంస్కృతి తమ పార్టీకి లేదని టీడీపీ నాయకులు అన్నారు. కోట పట్టణంలోని రవినగర్‌లో ఉన్న టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ నాయకులు మీడియాతో మాట్లాడారు. కోట పంచాయతీలో వైసీపీ నేతలు ఇష్టారాజ్యంగా వ్యవహరించి స్థానికులను ఇబ్బంది పెట్టారన్నారు. పంచాయతీకి చెందిన రూ.3 కోట్లను స్వాహా చేశారన్నారు. పంచాయతీ దుకాణాల విషయంలో టీడీపీ నాయకులు లాలుచీ పడ్డారని వైసీపీ నాయకులు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. తాము లేకపోతే పంచాయతీని వైసీపీలో ఉన్న కొంతమంది నాయకులు తాకట్టు పెట్టేవారన్నారు. రూ.3 కోట్ల అప్పుల నుంచి పంచాయతీని కాపాడామన్నారు. ఇలాంటి వ్యక్తులు తమపై బురదచల్లడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అదే విధంగా కోటలోని బీసీ బాలుర గురుకుల పాఠశాలలో లక్షలాది రూపాయలకు ఉద్యోగాలు అమ్ముకుని పేదల కడుపుకొట్టింది వైసీపీ నాయకులు కాదా అన్ని ప్రశ్నించారు. అభివృద్ధి కోసం పరుగులుతీసే తమ నాయకులపై ఇలాంటి ప్రచారాలు చేస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా ప్రచార కార్యదర్శి టి. రాధాకృష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు షంషుద్దీన్, ఉపాధ్యక్షుడు వి.అనిల్, ఎంపీటీసీ సభ్యుడు డి.సురేష్, మైనార్టీసెల్ నాయకులు నౌషాద్, బాబు, కార్యవర్గ సభ్యులు టి.శ్రీనివాసులు, నందా మోహన్ తదితరులున్నారు.

కోటమ్మకు పూజలు



కోట, ఆగస్టు 18 : కోట గ్రామదేవత కోటమ్మ అమ్మవారికి ఆదివారం విశేష పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కోట, వాకాడు, చిట్టమూరు, ఓజిలి మండలాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆయా మండలాల నుంచి వచ్చిన భక్తులకు పాలకమండలి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ముత్యాలమ్మకు...



చిల్లకూరు, ఆగస్టు 18: మండలంలోని తూర్పుకనుపూరులో కొలువై ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని అమ్మవారికి నైవేద్యం నివేదించారు. ఆలయం ఎదుట వున్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నిత్యావసరాల పంపిణీ


దివ్యాంగులకు కూరగాయలు, గుడ్లు అందజేస్తున్న జేవీవీ సభ్యులు

గూడూరు/ గూడూరు అర్బన్, ఆగస్టు 18: స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రభాకర్‌రెడ్డి దాతృత్వంతో దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేవీవీ పట్టణాధ్యక్షుడు వి.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ... ప్రతినెలా తమ సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు నిత్యావసరాలు అంది స్తున్నామన్నారు. నాగరాజు, చెంచునారాయణ, రాధయ్య, సుబ్రమణ్యం, రజినీ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు.సనత్‌కుమార్‌రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, రాఘవరెడ్డి, కృష్ణారెడ్డి, కిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన



నాయుడుపేట టౌన్, ఆగస్టు 18: పట్టణంలోని జనరల్ పాఠశాలలో కంటి వైద్య ఉచిత శిబిరం జరిగింది. ఆదివారం చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమో రియల్ ట్రస్టు ఆధ్వర్యంలో శిబిరాన్ని తిరుపతి ఎస్వీ అరవింద్ నేత్రాలయ సహకారంతో నిర్వహించారు. 150 మందికి పరీక్షలు నిర్వహించి 50 మందికి మందులను, 45 మందికి కంటి అద్దాలను ఉచితంగా అందజేశారు. 33 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. కృష్ణ, దిలీప్, జగదీష్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కోటపోలూరులో...

సూళ్లూరుపేట, ఆగస్టు 18: మండల పరిధిలోని కోటపోలూరులో కేజేఆర్ చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నేత్ర వైద్య శిబిరం జరిగింది. తిరుపతికి చెందిన ఎస్వీ అరవింద్ కంటి వైద్యశాల సహకారంతో జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో జరిగిన ఈ శిబిరంలో 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 40మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. ఈ శిబిరాన్ని షార్ డిప్యూటీ డైరెక్టర్ రమేష్‌బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేజేఆర్ ట్రస్టు నిర్వాహకులు కోగిలి సురేష్ రెడ్డి, సభ్యులు రాజేష్ రెడ్డి, శ్రీనివాసులు, కృష్ణారెడ్డి, మోహన్, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

విత్త మంత్రి నిర్మలమ్మ జన్మదినోత్సవం

గూడూరు అర్బన్, ఆగస్టు 18: స్థానిక సంగం థియేటర్ సెంటర్ వద్ద ఆదివారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ పుట్టినరోజు కార్యక్రమాన్ని హీరాబెన్ మాతాజీ గ్లోబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు పెంచలనాయుడు మాట్లాడుతూ.. దేశ ఆర్థిక శాఖ మంత్రిగా నిర్మలా సీతారామన్ ఎనలేని సేవలను అందిస్తుందన్నారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టి, పేదలకు దుస్తులను అందజేసి, అన్నదానం చేశారు.

సర్వాయి పాపన్నగౌడ్ జయంతి



గూడూరు అర్బన్, ఆగస్టు 18: స్థానిక తాళమ్మ గుడి ఆవరణలో ఆదివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని నిర్వ హించారు. ఈ సందర్భంగా గౌడ సంఘ నాయకుడు శ్రీనివాసులుగౌడ్ మాట్లాడు తూ.. బహుజనుల కోసం పాపన్నగౌడ్ గోల్కొండ నవాబులతో అలుపెరుగని పోరాటాలు సాగించారన్నారు. అనంతరం పాపన్నగౌడ్ చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా

సూళ్లూరుపేట, ఆగస్టు 18: మండల పరిధిలోని ఆబాక గ్రామంలో ఆదివారం రాత్రి ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. సూళ్లూరుపేట నుంచి కంకర లోడ్‌తో ఏలికాడుకు వెళ్తున్న ట్రాక్టర్ ఆబాక రోడ్డు వద్ద ఎదురుగా కారు రావడంతో అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న కాలువలో బోల్తాపడింది. ఈ ప్రమాదం జరిగినప్పుడు ట్రాక్టర్‌లో డ్రైవర్, మరో ఇద్దరూ వ్యక్తులు ఉన్నారు. ఎవరికి ఏమి జరగలేదు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

ట్రాఫిక్ చిక్కుల్లో సూళ్లూరుపేట

- అడ్డదిడ్డంగా వాహనాల నిలిపివేత
- పట్టించుకోని పోలీసులు
- ఇబ్బందుల్లో ప్రజలు


బజారు వీధిలో స్తంభించిన ట్రాఫిక్ - బాపూజీ, బజారు వీధుల్లో నడి రోడ్డుపై నిలిపి ఉన్న వాహనాలు

సూళ్లూరుపేట, ఆగస్టు 18: పట్టణంలో ట్రాఫిక్‌తో నిత్యం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బజారు వీధుల్లో ద్విచక్ర వాహనాలే కాకుండా ఆటోలు, కార్లు ఎక్కడ పడితే అక్కడ నిలిపివేస్తున్నారు. బాపూజీ వీధి, కచ్చేరివీధుల్లో రోడ్డు కు అడ్డంగా వాహనాల నిలిపివేయడంతో పాదాచారులు కూడా అడుగుపెట్టలేని పరిస్థితి. పార్శిల్ లారీలు సమయపాలన లేకుండా బజారు వీధుల్లోకి రావడంతో రాకపోకల సమస్య తీవ్రమవుతోంది. పట్టించుకోవాల్సిన పోలీసులు సంబంధం లేనట్టుగా వ్యవహరిస్తున్నారు.

పట్టణంలో బాపూజీ, కచ్చేరివీధులు ప్రధాన వ్యాపార కేంద్రాలు. నిత్యం కొనుగోలు దారులతో రద్దీగా ఉంటాయి. ఆటోలు, కార్లు బజారు వీధుల్లోకి పనుల నిమిత్తం వచ్చి నడిరోడ్డులో ఆపేసి పనులు చూసుకొని తీరిగ్గా వచ్చి తీస్తున్నారు. అత్యవసర పనులపై వెళ్లాల్సినవారికి అవస్థలు తప్పడం లేదు. శని, ఆదివారాల్లో మాంబట్టు, శ్రీసిటి సెజ్‌లో పనిచేసే ఉద్యోగులకు సెలవు దినాలు కావడంతో ఆ రెండు రోజులు బాజరు వీధుల్లో నడిచి వెళ్లాలన్న నరకం కనబడుతోంది. పట్టణంలో రోజురోజుకు ట్రాఫిక్ స్తంభించిపోతున్నా పోలీసులు స్తబ్దుగా ఉండిపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల బాధ్యతలు తీసుకొన్న సీఐ ట్రాఫిక్ పై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైన ఉంది.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోండి: పాశిం


రక్తదాన శిబిరంలో ఎమ్మెల్యే పాశిం, నానాజీ తదితరులు

గూడూరు, ఆగస్టు 18: ఆరోగ్యం పట్ల ప్రతిఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సూచించారు. ఆదివారం సీఎస్ఎం పాఠశాలలో బుజ్జమ్మ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో చెన్నైకి చెందిన కేవీటీ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి సహకారంతో ఉచిత వైద్య, రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉంటేనే ఏదైనా సాధించవచ్చన్నారు. గూడూరు వంటి పట్టణంలో చెన్నైకి చెందిన సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యనిపుణులు పలు విభాగాల్లో ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందించడం హర్షణీయమన్నారు. వైద్యుల సూచనలను పాటిస్తూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. రక్తదాన శిబిరం ద్వారా సేకరించిన రక్తాన్ని ఏరియా ఆసుపత్రి బ్లడ్‌బ్యాంకుకు అందించడం ద్వారా ఆపదలో ఉన్న రోగులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఖరీదైన వైద్యపరీక్షలను శిబిరంలో అందించడం అభినందనీయమని టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీ అన్నారు. కోల్‌కాతాలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం చేయడం బాధకరమని నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. శీలం కిరణ్‌కుమార్, ఎస్.భాస్కర్‌రెడ్డి, మస్తాన్‌నాయుడు, పి.శ్రీనివాసులు, బి. చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, సర్వోత్తమరెడ్డి, ఇశ్రాయిల్‌కుమార్, ప్రణీత్, చంద్రనీల్, రత్నం, వివేకనందన్, మౌలాలి, శ్రీనివాసులురెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రూ.10 నాణెం... వద్దేవద్దు!



తడ, ఆగస్టు 18: ఓ పక్క 10 రూపాయల నాణెం చెల్లుతుందని ఆర్‌బీఐ చెబుతున్నా.. నాణేలను తీసుకునేందుకు వ్యాపారులు నిరాకరిస్తున్నారు. చివరకు పెట్రోల్ బంకులు సైతం ఇదే పంథా అవలంబిస్తున్నాయి. 10 రూపాయల నోట్ల స్థానంలో ఐదేళ్ల క్రితం రూ.10 నాణేలను ఆర్‌బీఐ అందుబాటులోకి తెచ్చింది. కొంతకాలం వాటిపై ఎటువంటి అభ్యంతరాలు లేకపోయినా రెండేళ్ల నుంచి దుకాణదారులు వాటిని తీసుకునేందుకు నిరాకరిస్తూ వచ్చారు. ఈ నాణేలు వినియోగంలోనే ఉన్నాయంటూ ఆర్‌బీఐ చెబుతున్నా వ్యాపారులు వాటిని తీసుకోవడానికి వెనకడుగు వేస్తున్నారు. ఇటీవల రూ.10 నోట్ల కొరత వచ్చింది. సూళ్లూరుపేట, తడల్లో ఆ నోట్ల కొరత ఎక్కువగా ఉంది. ఈ క్రమంలో కొద్ది రోజుల క్రితం ఆర్‌బీఐ మరోసారి పది రూపాయల నాణేల వినియోగంపై క్లారిటీ ఇచ్చింది. వీటిని తిరస్కరించిన వారిపై చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరించింది. అయినా దుకాణ యజమానుల్లో మార్పురాలేదు. దీనికి తోడు పెట్రోలు బంకులు సైతం ఈ నాణేలను తీసుకునేందుకు నిరాకరిస్తున్నాయి. ఆది వారం సూళ్లూరుపేట కనక దుర్గా మహల్ సమీపంలోని పెట్రోల్ బంకులో కొందరు వాహనదారులు ఆ నాణేలను ఇవ్వగా వాటిని అక్కడ సిబ్బంది తిరస్కరించడంతో వారితో వాగ్వాదానికి దిగారు. చిన్న వ్యాపారులు అవగాహన లేక నాణేలను తిరస్కరిస్తున్నారంటే వారిలో ఉన్న భయాలకు అర్థం ఉంది. కానీ కేంద్ర పెట్రోలియం సంస్థల ద్వారా నడిచే పెట్రోల్ బంకులు సైతం తిరస్కరించడం విడ్డూరంగా ఉందని వీటిపై చర్యలు తీసుకోవాలంటూ స్థానికులు కోరుతున్నారు.

దొంగ బాబాపై చర్యలు తీసుకోండి: జేవీవీ



మాట్లాడుతున్న జేవీవీ రాష్ట్ర కమిటీ సభ్యుడు పెంచలయ్య

తడ, ఆగస్టు 18: మూఢ నమ్మకాలను ప్రచారం చేస్తూ అమాయక ప్రజలను మోసం చేస్తున్న ఓ దొంగ బాబాపై చర్యలు తీసుకోవాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు పెంచలయ్య కోరారు. కొండూరు పంచాయతీ సుందరపురం పాఠశాలలో జేవీవీ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న పెంచలయ్య మాట్లాడుతూ... కృష్ణా జిల్లాకు చెందిన శేషగిరిరావు అనే స్వామి కొండూరు పంచాయతీ సుందరపురం ప్రభుత్వ భూమిని కబ్జాచేసి క్షుద్రపూజలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. తాను దేవుడితో నేరుగా మాట్లాడుతానంటూ, ప్రజల సమస్యలు, జబ్బులు నయం చేస్తానంటూ అమాయకులను మభ్యపెట్టి వేల రూపాయలను వసూలు చేస్తున్నాడన్నారు. సూళ్లూరుపేట మండలం జంగాలగుంటకు చెందిన ఓ మహిళ వద్ద వైద్యం పేరుతో రూ.7వేలు వసూలు మందులు ఇచ్చాడని అవి వికటించి ఆమె చనిపోయిన విషయం వెలుగులోకి రాకుండా చేశాడని ఆరోపించాడు. రాత్రి వేళల్లో క్షుద్రపూజలు చేస్తున్నాడని వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ తరహా దొంగ స్వాముల విషయంలో ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యవంతులుగా చేస్తున్నామన్నారు. చెంగయ్య, కృష్ణారావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్, చంద్రశేఖర్, రాజేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

15మంది స్మగ్లర్ల అరెస్టు

ఐదు గొడ్డళ్లు స్వాధీనం


పట్టుబడ్డ స్మగ్లర్లతో టాస్క్‌ఫోర్సు

మంగళం, ఆగస్టు 18: ఎర్రచందనం దుంగలకోసం అడవిలోకి చొరబడుతున్న 15మంది స్మగ్లర్లను ఆదివారం టాస్క్‌ఫోర్సు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి బ్యాగ్, పిడిలేని గొడ్డళ్లను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఇన్‌చార్జి, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడి ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ(రిజర్వుడ్) సురేష్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో ఆర్ఎస్ఐ విశ్వనాథం బృందం తిరుపతి సమీపంలోని మంగళం నుంచి కరకంబాడి మీదుగా బాలపల్లి వైపు కూంబింగ్ చేపట్టారు. ఆదివారం ఉదయం టీఎస్‌పాళెం సెక్షన్ కరకంబాడి సమీపంలోని వెంకటేశ్వరస్వామి ఆలయం వైపు ఉన్న నిషేధిత అటవీ ప్రాంతంలో కొంతమంది వెళుతూ కనిపించారు. వారిని చుట్టుముట్టగా కొందరు పారిపోయారు. వారిలో 15మందిని అదుపులోకి తీసుకోగలిగారు. వారిని తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై జిల్లా జమనామత్తూరుకు చెందిన అరుళ్, ఆనందన్ గోపాల్, సేతు అన్నామలై, జయమణి, చక్రవర్తి, శివలింగంరామన్, కుప్పుస్వామి కొళంద్రై, రంజిత్ మాణిక్యం, కుప్పన్ గోవిందన్, గోవిందరాజ్ అరుణాచలం, శిలింగం మొట్టియన్, ఏలుమలై, సంతోష్ సెల్వరాజ్, మహేంద్రన్ గోవిందన్, జయవేలుగా గుర్తించారు. తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీసుస్టేషన్‌కు తరలించిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రఫీ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ సాగు పరిశీలన


వేరుశనగ పంటను పరిశీలిస్తున్న విదేశీ బృందం

తిరుచానూరు, ఆగస్టు 18: తిరుపతి రూరల్ మండలం వేమూరులో అయ్యప్పనాయుడు ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని ఆదివారం యూకేకు చెందిన ప్రొఫెసర్ ఫరేన్స్ సుధన్ తన బృందంతో కలిసి ఆదివారం సందర్శించారు. పీఎండీఎస్ పంటలు, విత్తనాల కిట్లు, సీడ్ బాల్స్ ప్రత్యక్షంగా తయారు చేయడం, ఏటీఎం మోడల్ ఘన జీవామృతాన్ని అయ్యప్పనాయుడు ప్రత్యక్షంగా చేసి చూపించారు. ప్రకృతి వ్యవసాయ సార్వత్రిక సూత్రాలను వివరించారు. **రామచంద్రాపురం:** శ్రీరామపురం, కుప్పంబాదూరు, పున్నమనాయుడుకండ్రిగ, పాలేపల్లి గ్రామాల పరిధిలోని ప్రకృతి వ్యవసాయ తోటలను విదేశీ బృందంతోపాటు ఇతర రాష్ట్రాల ప్రతినిధులు పరిశీలించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


పోలీస్ స్టేషన్ వద్ద పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

పెళ్లకూరు, ఆగస్టు 18: నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను ఎస్ఐ శ్రీకాంత్ స్వాధీనం చేసుకొన్నారు. మండలంలోని కలవకూరు సమీపంలో స్వర్ణముఖి నది నుంచి ఆదివారం రాత్రి ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు దాడులు చేశారు. నదిలో ఇసుకను నింపుతున్న 5 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మండలంలోని కలవకూరు, కుల్లూరు, ముమ్మారెడ్డిగుంట సమీపంలోని స్వర్ణముఖి ఇసుక తరలుతోంది

తిరుమల బాలాజీనగర్‌లో విస్తృత తనిఖీలు


బాలాజీనగర్‌వాసులతో మాట్లాడుతున్న విజిలెన్స్, పోలీసు అధికారులు

తిరుమల, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): తిరుమలలో వరుసగా జరుగుతున్న సంఘటనల నేపథ్యంలో విజిలెన్స్, పోలీసు అధికారులు ఆదివారం తనిఖీలు చేపట్టారు. అత్యంత రద్దీ ప్రదేశమైన నందకం వద్ద పట్టపగలు ఇద్దరు హాకర్లు గాజుబాటిళ్లతో ఒకరిపై ఒకరు దాడి చేసుకుంటూ రక్తగాయాలతో వీరంగం సృష్టించి భక్తులను భయభ్రాంతులకు గురిచేసిన విషయం తెలిసిందే. తిరుమలలో నిషేధిత మద్యం, పొగాకు ఉత్పత్తులు కూడా లభిస్తున్నాయనే సమాచారం నేపథ్యంలో భద్రతను పెంచేందుకు, అనధికార వ్యక్తులను గుర్తించి తరలించాలని టీటీడీ సీవీఎస్వో శ్రీధర్ ఆదేశించారు. ఈమేరకు విజిలెన్స్ వీఎస్వో సురేంద్ర ఆధ్వర్యంలో విజిలెన్స్, పోలీసులు అధికారులు, సిబ్బంది బాలాజీనగర్‌లో పాచికాల్వ గంగమ్మ ఆలయానికి సమీపంలో కూలీలు ఏర్పాటు చేసుకున్న షెడ్లపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. గతంలో తిరుమలలో వివిధ నిర్మాణ పనుల్లో కూలీలుగా పనిచేసిన వారి కోసం తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేశారు. పనులు పూర్తయినా చాలా మంది ఇప్పటికీ 70పైగా షెడ్లలో నివాసముంటున్నట్టు అధికారులు గుర్తించారు. ఇందులో గుర్తింపులేని అనధికార వ్యక్తులు కూడా ఉన్నట్టు తేలింది. ఈక్రమంలో కార్మికుల జాబితాను ధ్రువీకరణ కోసం ఇంజినీరింగ్ విభాగానికి కూడా పంపారు. అనధికారికంగా ప్రవేశించే వారిని నిలువరించేందుకు ఇకపై ఇలాంటి దాడులు నిరంతరాయంగా నిర్వహిస్తామని టీటీడీ అధికారులు తెలిపారు. అనధికారికంగా నివసిస్తున్న వ్యక్తులు, సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎండ వేడిమితో అల్లాడుతున్న ప్రజలు


నిర్మానుష్యంగా ఉన్న ఆర్టీసీ బస్టాండు రోడ్డు

గూడూరు, ఆగస్టు 18: వారం రోజులుగా ఎండవేడిమి పెరగడంతో ఉక్కపోతకు ప్రజలు అల్లాడిపోతున్నారు. వేసవికాలం ముగిసినా ఎండల తీవ్రత తగ్గక పోవడంతో ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఉదయం 7గంటల నుంచే ఎండ తీవ్రత మొదలై సాయంత్రం 5గంటల వరకు కొనసాగుతోంది. దీంతో ప్రజలు పనుల నిమిత్తం బయటకు రావాలంటే ఇబ్బంది పడుతున్నారు. మధ్యాహ్నం సమయంలో ప్రధాన రహదారుల సైతం నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం మారి పది నిమిషాల పాటు వర్షం కురిసినా తిరిగి ఎండ తీవ్రత అధికమైంది. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా ఎండ తీవ్రతంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

రెండు ద్విచక్రవాహనాల ఢీ: ఒకరి మృతి


రామకృష్ణారెడ్డి మృతదేహం

తడ, ఆగస్టు 18: రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. మండల పరిధిలోని కారిజాత గ్రామానికి చెందిన డి.రామకృష్ణారెడ్డి (60) మాంబట్టు అపాచీ పరిశ్రమలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఆదివారం విధులకు హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. మార్గమధ్యంలో మాంబట్టు సెజ్ రోడ్డు మలుపు తిరుగుతుండగా తడ నుంచి సూళ్లూరుపేట వైపుకు వెళ్తున్న మరో బైక్ ఆయన్ను ఢీనింది. ఈ ప్రమాదంలో రామకృష్ణారెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతన్ని సూళ్లూరుపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్టు వైద్యులు ధృవీకరించారు. దీంతో రామకృష్ణారెడ్డి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి వివాహిత ఆత్మహత్య


శివాని (ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, ఆగస్టు 18: సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం నవజీవన్ ఎక్స్‌ప్రెస్ కిందపడి సూళ్లూరుపేట పట్టణం నాగరాజపురానికి చెందిన శివాని (25) ఆత్మహత్య చేసుకుంది. శివాని కుటుంబ కలహాలతో మనస్థాపం చెంది చెన్నై నుంచి అహ్మదాబాద్‌కు వెళ్లే నవజీవన్ రైలు కిందపడి ఆత్మహత్యకు చేసుకుందిన మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న రైల్వే పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ కే.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి..

గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి మృతి చెందాడు. సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ దక్షిణ వైపున చెన్నై వైపు వెళ్లే రైలు కిందపడి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడికి సంబంధించిన వివరాలేవి తెలియరాలేదు. సుమారు 45 సంవత్సరాలు వయస్సు ఉంటుంది. మృతదేహంపై నీలిరంగు చొక్కా, నీలిరంగు గళ్లల లుంగీ ఉన్నాయి. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎదురెదురుగా ఢీకొని కాలి బూడిదైన బైకులు



కోట, ఆగస్టు 18: మండలంలోని చంద్రశేఖరపురం వద్ద ఆదివారం రెండు మోటరు బైక్‌లు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు బైక్‌ల్లో మంటలు చెలరేగి కాలిపోయాయి. చిట్టేడు గ్రామానికి చెందిన కె. పార్వతయ్య, అంకమ్మ కోట నుంచి బైక్‌లో చిట్టేడుకు వస్తున్నారు. చిట్టమూరు మండలం మెట్టు గ్రామానికి చెందిన మహేష్, శ్రీనివాసులు గూడూరు నుంచి విద్యానగర్ వైపు వస్తున్నారు. ఈ రెండు మోటరు బైక్‌లు చంద్రశేఖరపురం వద్ద ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ సంఘటనలో పార్వతయ్యకు కాలువిరిగిపోగా, మహేష్, శ్రీనివాసులుకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వీరిని 108 అంబులెన్స్‌లో గూడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బైక్‌ల ఇంజన్లు పూర్తిగా కాలిపోయాయి.

బైక్‌ను ఢీ కొన్న కారు: ఇద్దరికి గాయాలు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 18: పట్టణంలోని అమరావతి సెంటర్ వద్ద బైక్‌ను కారు ఢీ కొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. దొరవారిసత్రం మండలానికి చెందిన సుబ్రహ్మణ్యం, మునస్వామి మోటరు సైకిల్‌పై ఆదివారం నాయుడుపేటకు వస్తుండగా అమరావతి సెంటర్‌వద్ద కారు ఢీ కొనింది. ఈ ప్రమాదంలో సుబ్రహ్మణ్యం, మునస్వామి గాయ ప డ్డారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలికి చేరుకొని క్షతగాత్రులను నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రేషన్ బియ్యం స్వాధీనం



నాయుడుపేట టౌన్, ఆగస్టు 18: పట్టణంలోని పడమటివీధి, వెంకటగిరి రోడ్డు సమీపంలో 2,750 కిలోల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని పడమటివీధిలో మినీ వ్యాన్‌లో 1,750 కిలోల రేషన్ బియ్యం తరలించేందుకు సిద్ధం చేస్తుండగా పోలీసులకు సమాచారం అందింది. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని బియ్యం సహా మినీ వ్యాన్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రంగయ్య, ప్రవీణ్‌రెడ్డి, హుస్సేన్‌పై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. అలాగే వెంకటగిరి రోడ్డు సమీపంలో నిల్వ ఉంచిన వెయ్యి కిలోల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని వెంకటేష్, శ్రీనివాసులుపై కేసు నమోదు చేశారు.

కిక్కిరిసిన ముక్కంటి ఆలయం



ముక్కంటి ఆలయం వద్ద ఉన్న భక్తులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 18: శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. వారాంతపు సెలవులు కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 26వేలమంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఇందులో రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 1,159 మంది, రూ.50 ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,624 మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 టిక్కెట్ల ద్వారా 2,501మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 864, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 265మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 243మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 64మంది భక్తులు రాహుకేతు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 15,909 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో మాస్టర్ ప్లాన్



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, ఆగస్టు 18: ముక్కంటి ఆలయ అభివృద్ధి కోసం అంతర్జాతీయ ప్రమాణాలతో మాస్టర్ ప్లాన్ పనులను చేపడతామని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ముక్కంటి ఆలయ అధికారులతో ఎమ్మెల్యే మాస్టర్‌ప్లాన్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. అంతకు ముందు మాస్టర్‌ప్లాన్ నిపుణుల బృందంతో కలిసి ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. మాస్టర్‌ప్లాన్ ప్రతిపాదించిన అభివృద్ధి పనులపై పరిపాలన భవనంలో అధికారులతో చర్చించారు. అధునాతన విధానాలతో మాస్టర్‌ప్లాన్‌ను మరింత విస్తరించేలా కృషి చేయాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ ముక్కంటి ఆలయ మాస్టర్ ప్లాన్ అభివృద్ధి పనులను ప్రతిష్ఠాత్మకంగా చేపడతామని, మాస్టర్‌ప్లాన్ కోసం కేటాయించిన నిధులతో పాటు దాతల సాయం తీసుకోబోతున్నామన్నారు. అలాగే పొరుగు రాష్ట్ర ప్రభుత్వాలకు స్థలాలు కేటాయించి ఆయా రాష్ట్రాల నిధులతో అధునాతన భవనాలను నిర్మిస్తామని వెల్లడించారు. ఇప్పటికే ఈ ప్రతిపాదనకు పలు రాష్ట్రాలు సానుకూలంగా స్పందించాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిరాజానాయుడు, చెంచయ్య నాయుడు, రవీంద్రనాథ్‌రెడ్డి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో కేంద్ర హోంశాఖ సెక్రటరీ



ఆలయ ధ్వజస్తంభం వద్ద అజయ్‌కుమార్ భల్లా కుటుంబ సభ్యులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 18: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం కేంద్ర హోంశాఖ సెక్రటరీ అజయ్‌కుమార్ భల్లా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. గురుదక్షిణామూర్తిసన్నిధిలో వేదపండితులు ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త పాడె మోసిన ఎమ్మెల్యే

రేణిగుంట, ఆగస్టు 18: ప్రమాదవశాత్తు మృతి చెందిన టీడీపీ కార్యకర్త మునెయ్య పాడెను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి మోశారు. ఆదివారం మధ్యాహ్నం మండల పరిధిలోని కరకంబాడి పంచాయతీ దొడ్లమిట్టలో మునెయ్య మృతదేహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. మునెయ్య మృతదేహంపై టీడీపీ జెండా కప్పి పాడె మోశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పించండి

వరదయ్యపాళెం, ఆగస్టు 18: శ్రీసిటీలో స్థానిక యువతకు ప్రభుత్వం ఉపాధి కల్పించాలని కాంగ్రెస్ పార్టీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త బాల గురవం బాబు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం శ్రీసిటీకి ముఖ్యమంత్రి చంద్రబాబు రానున్న నేపథ్యంలో సత్యవేడులో సమస్యలను పరిష్కరించాలని కోరారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సత్యవేడు నియోజకవర్గానికి శ్రీసిటీ సెజ్‌ను ఏర్పాటు చేయడంతో ఎంతో మంది యువతకు ఉపాధి లభించిందన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి మరింత దారుణంగా ఉందని, సత్యవేడు అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలని కోరారు.

శ్రీకాళహస్తి

సత్యవేడు

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు
యువకుడి దుర్మరణం



హర్షవర్ధన్ (ఫైల్‌ఫొటో)

ఏర్పేడు, ఆగస్టు 18: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందిన ఘటన ఆదివారం ఏర్పేడు మండలంలో చోటు చేసుకుంది. సీఐ శ్రీరామ శ్రీనివాసులు కథనం మేరకు... శ్రీకాళహస్తి మండలం చల్లపాళెం గ్రామానికి చెందిన వంకాయలపాటి హర్షవర్ధన్(26) ద్విచక్ర వాహనంపై సొంత పనుల నిమిత్తం స్వగ్రామం నుంచి తిరుపతికి బయలుదేరాడు. ఏర్పేడు మండలం సీతారాంపేట వద్ద తిరుపతి నుంచి గూడూరుకు వెళుతున్న కారు హర్షవర్ధన్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో హర్షవర్ధన్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని హర్షవర్ధన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిద్రిస్తున్న డ్రైవర్‌పైకి దూసుకెళ్లిన లారీ
బిహార్‌వాసి మృతి

ఏర్పేడు, ఆగస్టు 18: మండంలోని డిక్సన్ పరిశ్రమ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందాడు. బిహార్ రాష్ట్రానికి చెందిన లారీ డ్రైవర్ ప్రమోద్ రామ్ తమిళనాడు రాష్ట్రానికి చెందిన సంజయ్‌కుమార్ రాయ్, సురేష్‌బాబుతో కలిసి చెన్నై నుంచి లారీలో ఎల్ఈడీ టీవీ మెటీరియల్‌ను ఏర్పేడు మండంలోని డిక్సన్ కంపెనీకి తీసుకొచ్చారు. ఆదివారం కావడంతో అన్‌లోడ్ చేయలేదు. మధ్యాహ్నం ముగ్గురు మద్యం తాగారు. సంజయ్‌కుమార్ క్యాబిన్‌లో పడుకోగా ప్రమోద్‌రామ్ రోడ్డు మార్జిన్‌లో పడుకున్నారు. అయితే రోడ్డు మార్జిన్‌లో నిద్రిస్తున్న ప్రమోద్‌రామ్(43)పైకి లారీ వెళ్లడంతో అతను తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం జరిగిన తీరును పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లారీ హ్యాండ్‌లాక్ ఓపెన్ కావడం వల్ల ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు.

చిలుక వాహనంపై నీలకంఠుడి చిద్విలాసం



శ్రీకాళహస్తి, ఆగస్టు 18: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఊరందూరులో వెలసిన అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆదివారం చిలుక వాహనంపై గ్రామ వీధుల్లో ఊరేగారు. అంతకుముందు ఆలయంలో స్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. విశేషంగా అలంకరించి వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమస్వామి అమ్మవార్లను చిలుక వాహనంపై అధిష్ఠింపజేశారు. గ్రామవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

కోటేశ్వరరావుకు సన్మానం



కోటేశ్వరరావును సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

ఏర్పేడు, ఆగస్టు 18: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడుగా ఎన్నికైన తోటకూర కోటేశ్వరరావును ఆదివారం ఆయన స్వగ్రామం ఏర్పేడు మండలం కొత్తకండ్రిగలో వైస్ ఎంపీపీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల బీసీసెల్ అధ్యక్షుడు మునెయ్య, ఏర్పేడు హైస్కూల్ విద్యాకమిటీ చైర్మన్ సాంబయ్య, సుధాకర్, మురళీమోహన్, హరిబాబు, వెంకటప్రసాద్, చంద్రశేఖర్, తులసీరామ్, బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



శిథిలావస్థకు చేరుకుని కూలడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం - మరమ్మతులకు నోచుకోని తాగునీటి బోరు - మురుగుకాలువలు లేక బురదగా ఉన్న వీధి

గిరిజనుల ఘోష

- పల్లం గొల్లపల్లి గిరిజన కాలనీలో మౌలిక వసతుల లేమి
- రెండేళ్లుగా తాగునీటికి ఇబ్బందులు
- మురుగు కాలువలు లేవు, అధ్వానంగా వీధులు

ఏర్పేడు, ఆగస్టు 18: ఏర్పేడు మండలం పల్లం గొల్లపల్లి గిరిజన కాలనీలో మౌలిక వసతులు లేక స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏర్పడిన ఈ కాలనీలో 30 గిరిజన కుటుంబాలున్నాయి. అప్పట్లో అందరికీ ఇళ్లను నిర్మించి ఇచ్చారు. ప్రస్తుతం అవన్నీ శిథిలావస్థకు చేరుకుని వర్షాకాలంలో ఉరుస్తున్నాయి. దీంతో కొంతమంది పూరిగుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారు. కాలనీలోని వీధుల్లో సిమెంటు రోడ్లు, మురుగుకాలువలు నిర్మించలేదు. వర్షం వస్తే వీధులన్నీ బురదమయంగా మారుతున్నాయి. తాగునీటి బోరు రెండేళ్ల క్రితం మరమ్మతులకు గురైంది. బాగుచేయడం కోసం బోరు పైకప్పును తీసుకుని వెళ్లారు. తర్వాత పట్టించుకోకపోవడంతో తాగునీటికోసం కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నా అధికారుల కానీ, ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకోవడంలేదు. ఆ కాలనీ వైపు వెళ్లలేదు. దీంతో గిరిజనులు రైతుల పంట పొలాల్లో ఉన్న వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నారు. కాలనీ నడివీధిలో ఒక విద్యుత్ స్తంభం శిథిలావస్థకు చేరుకుని కూలి పోయే స్థితిలో ఉంది. పలుమార్లు విద్యుత్‌శాఖ అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ స్తంభం ఎప్పుడు కూలుతుందోనని భయపడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గిరిజకాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

శాస్త్ర సాంకేతిక రంగాల్లో యువత రాణించాలి



ప్రయోగ నమూనాలతో విద్యార్థులు - అంతరిక్ష దిన వేడుకలకు హాజరైన వివిధ పాఠశాలల విద్యార్థులు

ఏర్పేడు, ఆగస్టు 18: శాస్త్ర సాంకేతిక రంగాల్లో యువత రాణించాలని టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ రోషన్ శ్రీవాస్తవ విద్యార్థులకు సూచించారు. తిరుపతి ఐఐటీలో అంతరిక్ష దిన వేడుకలు ఆదివారంతో ముగిశాయి. పలు కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వివిధ రకాల సైన్స్ ప్రయోగాలను ప్రదర్శించారు. మొత్తం 75మంది విద్యార్థులు క్విజ్, ప్రసంగం, పోస్టర్ ప్రదర్శన పోటీల్లో పాల్గొన్నారు. వీరికి ఐఐటీ అధికారులు ప్రశంసాపత్రాలను అందించారు.ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మహేష్‌కుమార్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీల అణచివేత

శ్రీకాళహస్తి, ఆగస్టు 18: దళిత, గిరిజనులపై దాడులు, హత్యలు, అత్యాచారాలు గత జగన్ ప్రభుత్వ హయాంలో ఇష్టారాజ్యంగా సాగాయని తిరుపతి పార్లమెంటు టీడీపీ ఎస్టీసెల్ అధ్యక్షుడు ఎం.సుబ్బయ్య అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో అరాచకాలు పెరిగిపోయాయని, ప్రజల మాన ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన ఏటా జనవరి, జూలై నెలల్లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం అమలు తీరుపై హైపవర్ కమిటీ సమావేశాలు తప్పనిసరిగా నిర్వహించాలని చట్టం చెబుతోందని, వైసీపీ ఐదేళ్ల పాలనలో 2021లో ఒకే ఒక్కసారి సమీక్ష నిర్వహించారన్నారు. ఎన్డీఏ అధికారం చేపట్టిన నెల రోజుల్లోనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిట చట్టం అమలుపై నిర్దేశిత కాలవ్యవధిలో సమీక్షలు నిర్వహించాలని కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు ఇవ్వడం హర్షణీయమన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



ఏర్పేడు, ఆగస్టు 18: ఏర్పేడు జడ్పీ ఉన్నత పాఠశాలలో 2002-03 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాఘవయ్య, వనజాక్షి, వర్మ, పూర్వ విద్యార్థులు వెంకటరత్నం యాదవ్, శ్రీను, హరిరెడ్డి, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

వరదయ్యపాళెం, ఆగస్టు 18: కోల్‌కతాలోని ఆర్‌జీకార్ మెడికల్ కళాశాల పీజీ విద్యార్థినిపై అత్యాచారం, హత్య చేసినవారిని కఠినంగా శిక్షించాలని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ ఎస్.నాగరాజు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రోగుల ప్రాణాలు కాపాడే వైద్యులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. మహిళలకు పని ప్రదేశాల్లో, కళాశాలల్లో రక్షణ కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. నిందితులను తక్షణమే కఠినంగా శిక్షించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు.

ఆటస్థలం లేక విద్యార్థుల ఇబ్బందులు

కేవీబీపురం, ఆగస్టు 18: మండల కేంద్రంలో ఉన్న కస్తూర్బా గాంధీ పాఠశాల ఏర్పడి ఇప్పటికీ దాదాపు 15 సంవత్సరాలు కావస్తోంది. అయితే ఇంత వరకు ఆటస్థలం లేదు. సుమారు 300మంది విద్యార్థులు ఇక్కడ విద్యను అభ్యస్తుంటే క్రీడలకు సంబంధించి అనువైన స్థలం లేదు. సంబంధించి అధికారులు స్పందించి ఆట స్థలాన్ని కేటాయించాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఆకట్టుకున్న దుర్యోధన, దుశ్శాసన వధ



విశేష అలంకరణతో ద్రౌపదీదేవి

పిచ్చాటూరు, ఆగస్టు 18: మండల కేంద్రమైన పిచ్చాటూరు పట్టణంలోని ధర్మరాజస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షికోత్సవాల్లో చివరి రోజు ఆదివారం సాయంత్రం అగ్నిగుండ ప్రవేశం జరిగింది. ఉదయం దుర్యోధన, దుశ్శాసన వధ ఘట్టం, ద్రౌపదీదేవి కురులను దుర్యోధన రక్తంతో ముడివేసే కార్యక్రమం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. సాయంత్రం అగ్నిగుండ ప్రవేశం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామ జీర్ణోద్ధరణ కమిటీ సభ్యులు, ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. అగ్నిగుండ ప్రవేశం అనంతరం వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించిన ద్రౌపదీ అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో మంగళ వాయిద్యాలు, బాణసంచా పేలుళ్లు, బ్యాండ్ మేళాలు డప్పు వాయిద్యాలు, యువకుల విన్యాసాలు, నృత్యాలు నడుమ ఊరేగించారు.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం



ఏర్పేడు, ఆగస్టు 18: పాపానాయుడుపేటలోని ధర్మరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అగ్నిగుండ ప్రవేశం జరిగింది. సుమారు వెయ్యిమంది భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు స్వామి వారిని దర్శించుకున్నారు.

పుత్తూరు వార్తలు

సీతారామస్వామి ఆలయ మహాకుంభాభిషేకం



కుంభాభిషేకంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

వడమాలపేట, ఆగస్టు 18: మండలంలోని ఎస్వీపురం సీతారామస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న కుంభాభిషేక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మహాకుంభాభిషేకం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు అనంతరం వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు. సాయంత్రం భక్తుల హరినామస్మరణల నడుమ సీతారాముల కల్యాణం కోలాహలంగా జరిగింది. రాత్రి సీతారాముల ఉత్సవ విగ్రహాలను సర్వాంగ సుందరంగా అలంకరింపజేసి గ్రామంలో ఊరేగించారు. మధ్యాహ్నం కోనేటి లక్ష్మీప్రసాద్, నాగపూర్ణ, కొండూరు జయదేవరాజులు అన్నదానం చేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.02 కోట్లు

తిరుమల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.02 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ప్రకటించింది. కాగా, శనివారం 77,807 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 38,340 మంది శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

కల్పవృక్ష వాహనంపై ఊరేగిన ద్రౌపదీదేవి



కల్పవృక్ష వాహనంపై ద్రౌపదీదేవి - అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

పుత్తూరు టౌన్, ఆగస్టు 18: పుత్తూరు పట్టణంలోని ద్రౌపదీదేవి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం కల్పవృక్ష వాహనంపై ఊరేగారు. ఉదయం అమ్మవారికి అభిషేకం చేసి, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం కల్పవృక్ష వాహనంపై అమ్మవారు ఊరేగుతూ ప్రజలకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమాన్ని విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం

ద్రౌపదీదేవి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఉదయం ఆలయంలో అగ్ని గుండ ప్రవేశం చేసే భక్తులకు కంకణాలు ధరించారు. పట్టణంలోని మంచి నీళ్లగుంట వద్ద స్నానమాచరించి పసుపు వస్త్రాలు ధరించారు. తలకు పసుపు, పూలు చుట్టుకుని గోవింద నామంతో జపిస్తూ, వేపాకు మండలను చేతిలో పట్టుకుని పట్టణ పరిధిలోని ఇళ్ల వాకిలి బయట ఉంచినా పసుపు నీటిని చల్లుకుంటూ ఆలయం వద్దకు చేరుకుని భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. రాత్రి అమ్మవారిని వివిధ పుష్పాలతో, విద్యుత్ దీపాలంకరణల నడుమ సూర్యప్రభ వాహనంపై ఊరేగించారు.

బంగారు అభరణాలు కొనేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌బాబు

పుత్తూరు టౌన్, ఆగస్టు 18: ప్రజలు బంగారు అభరణాలు కొనేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు సూచించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పుత్తూరులో కొంతమంది దుకాణదారులు 916 కేడీఎం కాకుండా నాసిరకం బంగారాన్ని విక్రయిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. హాల్ మార్కు ఉండే ఆభరణాలను కొనాలని కోరారు. అలాగే నాసిరకం బంగారం విక్రయిస్తున్న దుకాణదారులు తమ తీరు మార్చుకోవాలని, అమాయకులైన ప్రజలను మోసం చేస్తే ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. అలాగే కుదువ వ్యాపారులు అధిక వడ్డీలతో ప్రజలను పీల్చిపిప్పి చేస్తున్నా రని, వారిలో మార్పురాకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రవినాయుడు, శ్రీజ బాలాజీ నాయుడు, ధనపాల్, జలకం నవీన్, దాసరి విజయ్, బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.